మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 27-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 328 Issue: 328

27 మే 2026 - బుధవారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:41, తిథి, ఏకాదశి ఉ. 6:22 వరకు, తరువాత ద్వాదశి, సంస్కృత వారం, సౌమ్య వాసరః, నక్షత్రం, హస్త తె. 5:51 వరకు, తరువాత చిత్తా, యోగం, వ్యతీపాత తె. 3:19ం వరకు, కరణం, విష్టి ఉ. 6:22 వరకు, బవ రా. 7:09 వరకు, వర్జ్యం, మ. 2:40 నుండి సా. 4:25 వరకు, దుర్ముహూర్తం, ఉ. 11:47 నుండి మ. 12:39 వరకు, రాహుకాలం, మ. 12:13 నుండి మ. 1:50 వరకు, యమగండం, ఉ. 7:22 నుండి ఉ. 8:59 వరకు, గుళికాకాలం, ఉ. 10:36 నుండి మ. 12:13 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:09 నుండి తె. 4:57 వరకు, అమృత ఘడియలు, రా. 1:07 నుండి రా. 2:52 వరకు, అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana

## ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి




### పోరాటాల కంటే శాంతి మేలు

### మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ

న్యూఢిల్లీ: దేశంలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగాలంటే ఆవును జాతీయ జంతువుగా ప్రకటించడం మంచిదని మాజీ ఉపరాష్ట్రపతి మహమ్మద్ హమీద్ అన్సారీ అభిప్రాయపడ్డారు. ముస్లిం సంస్థలు ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని చేస్తున్న డిమాండ్‌కు ఆయన మద్దతు తెలిపారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హమీద్ అన్సారీ మాట్లాడుతూ.. "సమస్యకు మూల కారణం తొలగించగలిగితే మంచిది. పోరాటాలు,

- తరువాయి 2 వ పేజీలో...



## సామాన్యుడిపై తిక్క!

### వడ్ల సంగతి చూడాలంటే జాబ్ పీకేశారు

### విధుల్లోంచి జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ తొలగింపు

### తీవ్రంగా ఖండించిన బీజేపీ, బీఆర్ఎస్

### తొలగించబోమని పొన్నం ప్రకటన



జగిత్యాల, మే 26 (ఈవార్తలు): పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు నిరసనగా జగిత్యాలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జగిత్యాలలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేస్తుండగా అదే మార్గంలో వస్తున్న ఆర్టీసీ డ్రైవర్ అశోక్ పెట్రోల్, డీజిల్ రేట్ల గురించి తర్వాత ఆందోళన చేయొచ్చు కానీ.. ముందు వడ్లు, మక్కలు కొనట్లేదు.. ముందు వాటి గురించి పట్టించుకోండి.. అంటూ సూచించిన విషయం తెలిసిందే. అయితే దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవడంతో డ్రైవర్ అశోక్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కించపరుస్తూ మాట్లాడాడని జగిత్యాల మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ ఆర్టీసీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫిర్యాదు ఆధారంగా జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. ముందు వడ్లు కొనండి అని చెప్పినందుకు ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను విధుల నుండి తొలగిస్తూ జగిత్యాల ఆర్టీసీ రీజినల్ మేనేజర్

- తరువాయి 2 వ పేజీలో...

## అర్ధరాత్రి చల్లచల్లగా!

### మంగళవారం అర్ధరాత్రి వర్షం

### రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జల్లులు



హైదరాబాద్, మే 26 (ఈవార్తలు): తెలంగాణ తీవ్ర ఎండల నుంచి ఉపశమనం లభించేలా మంగళవారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ముంచెత్తింది. రాష్ట్రంలోని మంచిర్యాల, ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, పెద్దపల్లి, జగిత్యాల, యాదాద్రి భువనగిరి, నల్గొండ, మేడ్చల్, యాచారం, సూర్యాపేట, భూపాలపల్లి, మెదక్, కామారెడ్డి, ఖమ్మం, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు కురిశా యి. హైదరాబాద్ పరిధిలోని కాప్రా, అల్వాల్, సికింద్రాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ మీదుగా ఎల్బీ నగర్, మలక్‌పేట్, హయాత్‌నగర్ వరకు పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నానికి, రాత్రికి ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో చల్లని వాతావరణాన్ని తెలంగాణ వాసులు ఆస్వాదించారు.

# డీకేకు సీఎం డ్యూటీ!

## మద్దతు తెలిపిన కాంగ్రెస్ హైకమాండ్!?

### ఈ వారమే సిద్ధరామయ్య రాజీనామా?

### అలాంటిదేం లేదు: కేసీ వేణుగోపాల్

**కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి కోసం నెలకొన్న అధిపత్య పోరుకు ఎట్టకేలకు తెరపడింది. సీఎం పదవి విషయంలో డీకే శివకుమార్ వాదనకు కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం ఏకగ్రీవంగా మద్దతు తెలిపిందని సంబంధిత వర్గాలు మీడియాకు తెలిపాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసి, ఢిల్లీ నుంచే జాతీయ స్థాయిలో ఆయన మరింత కీలక పాత్ర పోషించాలని కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి.**

న్యూఢిల్లీ/బెంగళూరు: దానిపై నిర్ణయం తీసుకోవడానికి ఆయన సమయం కోరినట్లు పేర్కొన్నాయి. అయితే, రాబోయే రెండు మూడు రోజుల్లో సిద్ధరామయ్య రాజీనామా చేసే అవకాశం ఉందని వర్గాలు నొక్కి చెప్పాయి. 'డీకే శివకుమార్‌కు అధికార బదిలీ జరగాలనే విషయంలో హైకమాండ్ మొత్తం ఏకీభవించింది' అని వర్గాలు తెలిపాయి. మంగళవారం ఉదయం 6 గంటల పాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించిన కాంగ్రెస్, రాష్ట్రంలోని మూడు రాజ్యసభ



## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

### మూడ్రోజులు అనుమతి ఇచ్చిన మల్కాజిగిరి కోర్టు

**బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితుడు భగీరథ్‌ను పోలీసుల కస్టడీకి అప్పగిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు భగీరథ్‌ను మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించనున్నారు.**



మేడ్చల్, మే 26 (ఈవార్తలు): ఈ కేసులో లోతుగా విచారణ జరపడం నిందుతుడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. దాన్ని విచారించిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పును వెలువరిచింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను మే 22వ తేదీనే విచారించిన న్యాయస్థానం.. మే 26వ తేదీకి విచారణను వాయిదా వేసింది. నాలుగు రోజుల క్రితం తెలిపినట్లుగానే కస్టడీ పిటిషన్‌ను నేడు విచారించిన కోర్టు.. పోలీసులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ ప్రస్తుతం చంచల్‌గూడ

- తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,889 |
| వెండి (కిలో): | రూ.2,95,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,970 |

## లంచం దొంగ..

## ఆశ, దోశ, అప్పడం



### ఏసీబీకి అడ్డంగా దొరికిపోయిన శామీర్‌పేట ఎంఆర్వో

**శామీర్‌పేట్ ఎమ్మార్వో సుచరిత ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. భూమి నాలా కన్వెర్షన్‌కి సుచరిత ఎకరాకు లక్ష రేట్ కార్డ్ ఫిక్స్ చేశారు. 30ఎకరాల భూమి కన్వెర్షన్‌కి 30 లక్షలు డిమాండ్ చేశారు.**

హైదరాబాద్, మే 26 (ఈవార్తలు): ఇందులో భాగంగా అడ్వాన్స్‌గా సుచరిత కారు డ్రైవర్ రూ.2లక్షలు తీసుకున్నారు. ఆ డబ్బును సుచరితకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. డబ్బు గురించి ప్రశ్నించగా సుచరిత, ఆమె డ్రైవర్ నీళ్లు నమిలారు. ఎమ్మార్వో సుచరిత శామీర్‌పేట్ ఆఫీస్‌నే అవినీతికి అడ్డాగా మార్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ

- తరువాయి 2 వ పేజీలో...

## ఆశపెట్టి.. ఆనక

# 6 కోట్లు దోచేసి!



**ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్లు, ట్రేడింగ్ యాప్స్ పేరుతో జరిగే సైబర్ మోసాలకు అంతేలేకుండా పోతోంది. రోజుకో తరహా కొత్త మోసాలతో సైబర్ కేటుగాళ్లు వల విసురుతున్నారు.**

### అమ్మాయి వాయిస్‌తో వాట్సాప్ కాల్

### ట్రేడింగ్ పేరిట వల విసిరిన సైబర్ నేరగాళ్లు

### నిజమని నమ్మి కోట్లు పోగొట్టుకున్న వృద్ధుడు

హైదరాబాద్, మే 26 (ఈవార్తలు): హైదరాబాద్ సనత్‌నగర్ లో నివసించే ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన 72 ఏళ్ల సీనియర్ ఎగ్జిక్యూటివ్.. సైబర్ కేటుగాళ్ల మాయమాటలు నమ్మి ఏకంగా రూ. 5.95 కోట్లు పోగొట్టుకున్నాడు. నకిలీ అప్లికేషన్ల ద్వారా విదేశీ కరెన్సీ, కమోడిటీస్ ట్రేడింగ్ పేరిట జరిగిన ఈ భారీ మోసంపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రధాన కార్యాలయ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ హై-ప్రొఫైల్

- తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



నెదర్లాండ్స్‌లో వృద్ధుల్లో ఒంటరితనాన్ని తగ్గించడానికి, విద్యార్థుల వసతి సమస్యకు చెక్ పెట్టేందుకు అక్కడి అధికారులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. డెవెంటర్‌లోని హ్యూమానిటాస్ రిటైర్మెంట్ హోమ్ కళాశాల విద్యార్థులకు అద్దె లేకుండా వసతి కల్పిస్తోంది. అయితే అందుకు ప్రతిఫలంగా వారు ప్రతి నెల కనీసం 30 గంటలు వృద్ధులతో గడపాలి. వృద్ధులతో మాట్లాడటం, కలిసి భోజనం చేయడం, సరదాగా సమయం గడపడం లేదా వారికి తోడుగా ఉండటం చేయాలి.

## మావోయిస్ట్ అగ్రనేత

# నరహరి లొంగుబాటు

### రూ.45 లక్షలు రివార్డు అందజేసిన డీజీపీ



**మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అగ్రనేత, మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్, ఆయన భార్య ధనమ్మ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మే 12న నరహరి దంపతులు లొంగిపోయినట్లు డీజీపీ సీవీ ఆనంద్ మంగళవారం ప్రకటించారు.**

› 2



## ఇరాన్‌పై

# అమెరికా భీకర దాడులు

### క్షిపణి స్థావరాలే టార్గెట్.. ఆత్మరక్షణ కోసమేనని ప్రకటన

### తుంగలో సీజ్‌ఫైర్ ఒప్పందం: ఇరాన్.. ప్రతీకార దాడులకు దిగుతామని హెచ్చరిక

టెహ్రాన్ : త్వరలో ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదరవచ్చని ప్రచారం జరుగుతున్న సమయంలో ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతాలపై అమెరికా తీవ్ర దాడులకు దిగింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. దక్షిణ ఇరాన్‌లో క్షిపణి ప్రయోగ కేంద్రాలు, మైన్స్ అమర్చుతున్న పడవలపై తాము ఆత్మరక్షణ దాడులు నిర్వహించినట్టు అమెరికా సైన్యం తెలిపింది. మరోవైపు టెహ్రాన్‌తో చర్చలు చాలా బాగా సాగుతున్నాయని దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఉన్నతస్థాయి

- తరువాయి 2 వ పేజీలో...

## బీమా చేయించి

# మరీ భర్తను చంపింది!

### 2 కోట్ల బీమా డబ్బుల కోసం దారుణ హత్య

### రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే నాటకం

### భార్య వివాహేతర బంధం బట్టబయలు




**మంచిర్యాల జిల్లాలో కలకలం రేపిన వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. రూ.2 కోట్ల బీమా సొమ్ము కోసం భార్యే భర్తను సుపారీ ఇచ్చి హత్య చేయించిందని తేలింది.**

› 2

# రాశి ఫలాలు

27-5-2026

మేషం: బంధువులు ఒక ముఖ్యమైన వ్యవహారంలో మీ మాటతో విబేదిస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. రాబడికి మించిన ఖర్చులు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

వృషభం: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. బంధు మిత్రులతో ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. నూతన ఋణయత్నాలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు మండకొడిగా సాగుతాయి. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి.

మిధునం: ప్రముఖుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. ఆర్థికంగా ఇబ్బంది ఉన్న అవసరానికి ధన సహాయం లభిస్తుంది.

కర్కాటకం: ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. దైవ చింతన పెరుగుతుంది. దాయాదులతో భూ వివాదాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మాట పట్టింపులు ఉంటాయి.

సింహం: ప్రముఖుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. విద్యార్థుల శ్రమ ఫలిస్తుంది. నిరుద్యోగుల కలలు నిజమవుతాయి.

కన్య: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఉంటాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో మనస్పర్థలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో విభేదిస్తారు. వృత్తి, వ్యాపారాలలో సమస్యలు తప్పవు.

తుల: సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. నూతన వస్తు లాభాలు పొందుతారు.

వృశ్చికం: నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక వివాదాలకు సంబంధించి ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో దీర్ఘకాలిక సమస్యల నుంచి గట్టెక్కుతారు. వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. బంధువులతో ఒక విషయంలో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో కొంత జాప్యం తప్పదు. ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

మకరం: ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితి ఉంటుంది. అవసరం లేని వస్తువులపై ధన వ్యయం చేస్తారు. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉద్యోగమున శ్రమాధిక్యత పెరుగుతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది.

కుంభం: ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు ఆశించిన స్థాన చలనాలు కలుగుతాయి.

మీనం: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. ప్రముఖుల సహాయంతో కొన్ని సమస్యలు పరిష్కరించుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఒత్తిడులు అధిగమిస్తారు. కీలక వ్యవహారాలలో సన్నిహితుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ ప్రతినిధి బృందం అమెరికాతో శాంతి చర్చల కోసం దోహాలో ఉన్న సమయంలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. పడవలపై అమెరికా జరిపిన దాడుల్లో నాలుగు దళాలకు చెందిన గార్డ్స్ చనిపోయినట్టు ఇరాన్‌కు చెందిన 'తబ్నాక్' అనే వెబ్‌సైట్ గుర్తించింది. హెర్మూజ్ జలసంధి సమీపంలోని మిలిటరీ పోర్టు, విమానాశ్రయం ఉన్న బందర్ అబ్బాస్ నగరం చుట్టుపక్కల పేలుళ్లు చోటుచేసుకొన్నాయని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ పేర్కొంది. వారాల తరబడి కొనసాగుతున్న కాల్పుల విరమణను ఈ తాజా దాడులు కుదిపేశాయి. పశ్చిమాసియాలో అమెరికా బేస్‌లకు ప్రాంతీయ శక్తులు ఇకపై రక్షణ కవచంగా పనిచేయబోవని, అమెరికాకు అక్కడ సురక్షిత ప్రాంతం ఉండబోదని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మంగళవారం హెచ్చరించారు. ఈ ప్రాంతంలో యూఎస్ తన ప్రభావాన్ని కోల్పోతున్నదని, రోజురోజుకూ అది తన పూర్వస్థితికి మరింత దూరమవుతున్నదని ఆయన అన్నారు. అమెరికా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే దానికి సమాధానం చెప్పే హక్కు తమకు ఉందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి అమెరికా తూట్లు పొడిచిందని ఇరాన్ విదేశాంగ శాఖ దుయ్యబట్టింది. ప్రతిదాడులకు దిగుతామని అమెరికాను హెచ్చరించింది.



అంతకుముందు ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ తన యురేనియంను నాశనం చేయడానికి అప్పగిస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ పర్యవేక్షణతో ఇరాన్‌లోనే దానిని నాశనం చేసే అవకాశాన్ని ఆయన ప్రతిపాదించారు. ఇరాన్ యుద్ధాన్ని ముగించడానికి జరిగే ఏవైనా ఒప్పందాలలో సౌదీ అరేబియా, పాకిస్థాన్‌లతో సహా మరికొన్ని అదనపు దేశాలు 'అబ్రహం ఒప్పందాలు'లో చేరాలనే నిబంధనను చేర్చాలని అన్నారు. ట్రంప్ చేసిన తాజా ప్రతిపాదన చర్చలను మరింత క్లిష్టం చేసే ప్రమాదం ఉన్నది. ఎందుకంటే ఆయన పేర్కొన్న కొన్ని దేశాలకు ఇజ్రాయెల్‌తో సంబంధాలపై దీర్ఘకాలిక షరతులు లేదా సున్నితత్వాలు ఉన్నాయి. 2020లో బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) అబ్రహం ఒప్పందంలో చేరి ఇజ్రాయెల్‌ను దౌత్యపరంగా గుర్తించిన మొదటి దేశాలుగా నిలిచాయి. సౌదీ అరేబియా ఇందులో చేరాలని ట్రంప్ చాలా కాలంగా ఆశిస్తున్నారు. అయితే సౌదీ అరేబియా దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌ను 1967 నాటి సరిహద్దులకు తిరిగి వెళ్లాలని, తూర్పు జెరూసలేం రాజధానిగా పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించాలని డిమాండ్ చేస్తున్నది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని పాకిస్థాన్ కూడా తన వైఖరిని పాలస్తీనా సమస్యతో ముడిపెట్టింది. ట్రంప్ తాజా ప్రతిపాదన చేసినప్పటికీ, ఇజ్రాయెల్‌పై పాకిస్థాన్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఇస్లామాబాద్‌కు చెందిన విశ్లేషకులు సయ్యద్ మహ్మద్ అలీ తెలిపారు. అమెరికాలో పాకిస్థాన్ మాజీ రాయబారి మసూద్‌ఖాన్ మాట్లాడుతూ ట్రంప్ జాబితాలోని దేశాలకు ఈ ప్రతిపాదన ఎంతవరకు సాధ్యమవుతుందో చూడాల్సి ఉందని అన్నారు.

# మావోయిస్ట్ అగ్రనేత నరహరి లొంగుబాటు

**రూ.45 లక్షలు రివార్డు అందజేసిన డీజీపీ**

హైదరాబాద్, మే 26 (ఈవార్తలు): మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అగ్రనేత, మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్, ఆయన భార్య ధనమ్మ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మే 12న నరహరి దంపతులు లొంగిపోయినట్లు డీజీపీ సీవీ ఆనంద్ మంగళవారం ప్రకటించారు. గత 45 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉంటూ మావోయిస్ట్ పార్టీలో కీలక పాత్ర పోషించారు. జనజీవన స్రవంతిలో చేరిన నరహరి, ధనమ్మలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున నరహరికి రూ.25 లక్షలు, ధనమ్మకు రూ.20 లక్షల చెక్‌ను డీజీపీ అందజేశారు. తెలంగాణకు చెందిన నరహరి, ఝార్ఖండ్‌కు చెందిన ఆయన భార్య ధనమ్మ లొంగుబాటుకు సంబంధించి గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. కానీ, ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువరించలేదు.



తాజాగా, దీనిని ధ్రువీకరించిన పోలీసులు.. వారిని మీడియా ముందుకు తీసుకొచ్చారు. నరహరి స్వస్థలం పాత వరంగల్ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామం. వరంగల్ ఎల్‌బీ కాలేజ్‌లో 1982లో డిగ్రీ చదువుతోన్న సమయంలోనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది. లొంగుబాటుకు ముందు ఆయన బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ ఇంఛార్జిగా, ఈస్ట్ రీజినల్ బ్యూరో (ఈఆర్‌బీ) ఇంఛార్జిగా, ఝార్ఖండ్ టెక్నికల్ డివిజన్ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఏపీలో గుంటూరుకు చెందిన పూనం ప్రస్తుతం రీజినల్ కమిటీ మెంబర్ హోదాలో ఉన్నట్లు సమాచారం. మావోయిస్ట్ పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక వేదికగా పరిగణించే కేంద్ర కమిటీ కొన్నేళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో మావోల కంచుకోటలు బద్దలయ్యాయి. వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లతో నక్సల్ సంఖ్య తగ్గిపోయింది. ఇప్పటికే పలువురు ముఖ్య నాయకులు ఎన్‌కౌంటర్లలో చనిపోగా, మరికొందరు లొంగిపోతున్నారు. ప్రస్తుతం నరహరి లొంగుబాటుతో కేంద్ర కమిటీలోని అత్యంత కీలక నేతలు మిసిర్ బెస్రా, గణపతి మాత్రమే మిగిలినట్లు భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా, 45 మంది నాయకులే అజ్ఞాతంలో ఉన్నారు.



# డీకేకు సీఎం డ్యూటీ!

(మొదటి పేజీ తరువాయి)

సీట్ల గురించే ఈ సమావేశం జరిగిందని పేర్కొంటూ, ఊహాగానాలకు దిగవద్దని మీడియాను హెచ్చరించింది. "రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చర్చలు జరిగాయి. ఇతర ఊహాగానాల్లో ఏమాత్రం నిజం లేదు" అని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక నిమిషం ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలో నాయకత్వ సమస్య ఏడాదికి పైగా రగులుతూనే ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, రొటేషన్ విధానంలో ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హైకమాండ్ హామీ ఇచ్చిందని శివకుమార్ మద్దతుదారులు పట్టుబట్టారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవికి పోటీదారులలో డీకే శివకుమార్ ఒకరిగా ఉన్నారని, రెండున్నరేళ్ల తర్వాత పదవి ఇస్తామని హామీ ఇచ్చిన తర్వాతే డిప్యూటీ పదవికి అంగీకరించారని వారు తెలిపారు. అయితే, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలు, దళితులను కలుపుకొని ఉన్న 'అహింద' వర్గంలో సిద్ధరామయ్యకు ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఆయనను పదవి నుంచి తప్పించడానికి కాంగ్రెస్ పార్టీ వెనుకాడింది. ఈ వర్గం 2023లో వొక్కలిగ-లింగాయత్ కుల సమీకరణాన్ని అధిగమించి కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సహాయపడింది. సిద్ధరామయ్య ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న నవంబరులో రొటేషన్ అంశంపై పెద్ద వివాదం చెలరేగినప్పటికీ, పొరుగున ఉన్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ వర్గాల నుంచి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందనే ఉద్దేశంతో కాంగ్రెస్ యథాతథ స్థితినే ఎంచుకుంది. కానీ ఇప్పుడు ఎన్నికలు ముగియడంతో శివకుమార్ సహనం నశిస్తోందని సిద్ధరామయ్య వర్గాలు సూచించడంతో పార్టీ కఠిన నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకుందని వర్గాలు తెలిపాయి. అయితే, స్థానిక నాయకులు మాత్రం సిద్ధరామయ్య కేంద్రంలో కీలక పాత్రను అంగీకరిస్తారా? లేదా? గౌరవప్రదంగా పదవి నుంచి వైదొలుగుతారా? లేక పదవీకాలాన్ని పొడిగించుకోవడానికి ప్రయత్నిస్తారా? అనే అంచనాల్లో తలమునకలయ్యాయి. సిద్ధరామయ్య పదవి నుంచి వైదొలగాలన్న నిర్ణయం పట్ల ఆయన సన్నిహితుల్లో కొందరు నాయకులు అసంతృప్తిగా ఉన్నారని వర్గాలు తెలిపాయి. తుది నిర్ణయం తీసుకునే ముందు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలనూ పరిశీలించుకోవాలని వారు ఆయనను కోరారు.

## బీమా చేయించి

# మరీ భర్తను చంపింది!

**2 కోట్ల బీమా డబ్బుల కోసం దారుణ హత్య**

**రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే నాటకం**

**భార్య వివాహేతర బంధం బట్టబయలు**

మంచిర్యాల, మే 26 (ఈవార్తలు): మంచిర్యాల జిల్లాలో కలకలం రేపిన వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. రూ.2 కోట్ల బీమా సొమ్ము కోసం భార్యే భర్తను సుపారీ ఇచ్చి హత్య చేయించిందని తేలింది. హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన సాయిని కుమార్ (45) ఈ నెల 22న బైక్‌పై మంచిర్యాల వైపు వెళ్తుండగా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అయితే ఘటనపై అనుమానం రావడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సంచలన విషయాలు బయటపడ్డాయి. కుమార్ భార్య భారతికి గ్రామానికి చెందిన సురేందర్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు గుర్తించారు. తమ బంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఇద్దరూ అతడిని హత్య చేయాలని ఏడాదిన్నరగా ప్రణాళిక రచించినట్లు పోలీసులు తెలిపారు. కుమార్ పేరిట ఎల్ఐసీతో పాటు పలు బీమా పాలసీలు తీసుకుని, ప్రమాదంలో మరణిస్తే సుమారు రూ.2 కోట్ల బీమా సొమ్ము వస్తుందని అంచనా వేశారు. ఈ క్రమంలో రామ్ మల్లేశ్‌కు రూ.10 లక్షల సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుని ముందస్తుగా రూ.2 లక్షలు చెల్లించినట్లు విచారణలో తేలింది. పథకం ప్రకారం ముల్కల్ల గ్రామ శివారులో కుమార్‌కు మద్యం తాగించి, ఇనుప సుత్తితో తలపై దాడి చేసి హత్య చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంగా కనిపించేలా మృతదేహం, బైక్‌ను రోడ్డు పక్కన పడేసి పరారయ్యారు. కుమార్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టగా, అసలు విషయం తెలిసింది. భారతి, సురేందర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు రామ్ మల్లేశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.



# సామాన్యుడిపై తిక్క!

(మొదటి పేజీ తరువాయి)

రిమూవల్ లెటర్ జారీ చేశారు. ప్రభుత్వ చర్యపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ప్రశ్నిస్తే ఉద్యోగంలోంచి తొలగిస్తారా? అని మండిపడ్డాయి.

**లేదు.. తొలగించలేదు: పొన్నం**

ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను ఉద్యోగం నుంచి తొలగించారని వస్తున్న వార్తలు అవాస్తవమని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తన ఎక్స్ హ్యాండిల్‌లో ఓ వీడియోను పోస్టు చేసిన మంత్రి.. ఆ డ్రైవర్ ఆర్టీసీ ఉద్యోగి కాదని, అద్దె బస్సు డ్రైవర్ అని తెలిపారు. అతణ్ని ఉద్యోగం నుంచి తప్పించొద్దని అద్దె బస్సు యజమానికి కూడా చెప్పామని మంత్రి స్పష్టం చేశారు. దీన్ని రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. డ్రైవర్ అశోక్ రైతుల పక్షాన మాట్లాడారని.. ఆయన మాటలను స్వాగతిస్తున్నారని మంత్రి తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం అలాంటి చర్యలు తీసుకోవాలని బస్సు యజమానికి చెప్పలేదన్నారు. ఇప్పుడే ఆర్టీసీ ఎండీతో మాట్లాడానన్నారు. డ్రైవర్ అశోక్ అద్దె బస్సులో తన పని తాను చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

(మొదటి పేజీ తరువాయి)

జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ కేసు విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. సిట్ ఇప్పటికే బాధితురాలితోపాటు ఆమె తల్లితో మాట్లాడి.. వారి దగ్గర్నుంచి కీలక సమాచారాన్ని సేకరించింది. బండి భగీరథ్ స్నేహితులను సైతం సిట్ విచారించింది.

# ఆశపెట్టి.. ఆనక 6 కోట్లు దోచేసి!

(మొదటి పేజీ తరువాయి)

మోసంపై సైబర్ పోలీసులు వేగంగా దర్యాప్తును ప్రారంభించారు. బాధితుడు వెల్లడించిన వివరాల ప్రకారం.. రెండు సంవత్సరాల క్రితం కావేరి అనే మహిళ నుంచి ఆయనకు మొదటిసారి వాట్సాప్ కాల్ వచ్చింది. తాను ముద్రా వన్, 9ప్రో స్టాక్ ట్రేడింగ్ అప్లికేషన్లలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నట్లు ఆమె పరిచయం చేసుకుంది. ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టే విధానాల గురించి వివరిస్తూ.. ఒకవేళ ట్రేడింగ్‌లో నష్టాలు వస్తే వాటిని కవర్ చేయడానికి ప్రత్యేక ఇన్సూరెన్స్ షీల్డ్ కూడా ఉంటుందని నమ్మబలికింది. ఆమె ఇచ్చిన నమ్మకంతో సదరు వృద్ధుడు ఆ నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లను తన మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ఇటీవల ఏప్రిల్ 13 నుంచి మే 11 మధ్య కాలంలో విదేశీ కరెన్సీలు, కమోడిటీస్ ట్రేడింగ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. ఈ కొద్ది రోజుల వ్యవధిలోనే ఆయన విడతల వారీగా మొత్తం రూ. 5.95 కోట్లను ఆ యాప్స్ ద్వారా డిపాజిట్ చేశారు. ఆ తర్వాత సదరు ఫేక్ అప్లికేషన్లలోని ట్రేడింగ్ అకౌంట్ స్క్రీన్‌పై లాభాలతో కలిపి మొత్తం రూ.42 లక్షల డాలర్లు ఉన్నట్లు డిస్‌ప్లే చూపించింది. దాంతో ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకోవడానికి ఆయన ప్రయత్నించగా.. సదరు ప్లాట్‌ఫారమ్‌లను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లు అసలు రంగు బయటపెట్టారు. సెటిల్‌మెంట్ జరగాలంటే క్రెడిట్ లెవరేజ్ కింద ముందస్తుగా మరో రూ.10 లక్షల డాలర్లు అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వాళ్లు అడిగిన భారీ మొత్తాన్ని మళ్లీ ఎలా చెల్లించాలా? అని బాధితుడు ఆలోచిస్తుండగానే మే మూడో వారంలో సదరు యాప్ నిర్వాహకుల నుంచి ఒక షాకింగ్ మెసేజ్ వచ్చింది. ముద్రా వన్, 9ప్రో అప్లికేషన్ల కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# లంచం దొంగ.. ఆశ, దోశ, అప్పడం

(మొదటి పేజీ తరువాయి)

ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని, ఎమ్మార్వో సుచరితతో పాటు ఆర్డీవో కీసర రాజేశ్, పలువురు సిబ్బందిని విచారిస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

వివాదాల కంటే దేశంలో శాంతి, సామరస్యాలు కొనసాగడం అవసరం" అని తెలిపారు. ఆవు వధను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆవును జాతీయ జంతువుగా ప్రకటించే దిశగా ఆలోచిస్తే అది మంచి నిర్ణయమవుతుందని అన్నారు. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. బక్రీద్ పండుగకు ముందు పలువురు ముస్లిం మత సంస్థలు కూడా ఇదే డిమాండ్‌ను ముందుకు తెచ్చాయి. మౌలానా అర్షద్ మదానీ ఇప్పటికే ఆవుకు జాతీయ జంతు హోదా కల్పించాలని కోరగా, పలువురు మత పెద్దలు కూడా మద్దతు ప్రకటించారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డుకు చెందిన మౌలానా ఖాలిద్ రషీద్ ఫరంగీ మహలీ మాట్లాడుతూ.. హిందూ సోదరుల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి అని అన్నారు. దేశవ్యాప్తంగా ఒకే విధమైన గోవధ నిషేధ చట్టం అమలు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలన్న డిమాండ్ మొదలైంది.

# ఒకటో తారీఖునే జీతాలు

**పంచాయతీ సిబ్బందికి తీపి కబురు.. జీతాల కోసం ప్రతినెలా రూ.50 కోట్లు.. ఇకపై నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి పెన్షన్లు**



హైదరాబాద్, మే 26 (ఈవార్తలు): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఓఆర్ఆర్‌పై ఎయిరిండియా బస్సు దగ్ధం

పెద్దఅంబర్‌పేట, మే 26 (ఈవార్తలు): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఈరోజు ఒక ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద అంబర్‌పేట సమీపంలో ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన ఒక బస్సులో అకస్మాత్తుగా భారీగా మంటలు చెలరేగాయి. బస్సు వేగంగా వెళుతున్న సమయంలో ఒక్కసారిగా వాహనం వెనుక భాగం నుంచి దట్టమైన పొగలు రావడాన్ని లోపల ఉన్న ప్రయాణికులు గమనించారు. ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో, ఆయన క్షణాల వ్యవధిలో చాకచక్యంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. ప్రయాణికులు కిందకు దిగుతుండగానే మంటలు బస్సు మొత్తానికి వేగంగా వ్యాపించాయి. ఓఆర్ఆర్‌పై బస్సు విపరీతమైన మంటలతో, భారీగా ఎగసిపడుతున్న పొగలతో తగలబడుతుండటంతో ఆ మార్గంలో వెళుతున్న ఇతర వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదం కారణంగా రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం బస్సులో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## కోకాపేట్ కొత్తచెరువులో హైడ్రా యాక్షన్

**గోల్డ్ ఫిష్ విల్లాస్ ప్రహరీ గోడ కూల్చివేత!**

కోకాపేట, మే 26 (ఈవార్తలు): హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని కోకాపేట్ కొత్తచెరువు పునరుద్ధరణ పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా చెరువుల పరిరక్షణే లక్ష్యంగా అక్రమ కట్టడాలపై విరుచుకుపడుతున్న హైడ్రా అధికారులు మరోసారి గట్టి చర్యలు చేపట్టారు. కొత్తచెరువు పరిధిని (ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్) ఆక్రమించి నిర్మించినట్లు గుర్తించిన ప్రముఖ "గోల్డ్ ఫిష్ విల్లాస్"కు చెందిన ప్రహరీ గోడను హైడ్రా సిబ్బంది భారీ యంత్రాలతో కూల్చివేశారు. ఈ కూల్చివేత సమయంలో హైడ్రా సిబ్బందితో పాటు ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా సంఘటనా స్థలంలోనే ఉండి పనులను పర్యవేక్షించారు. స్వాధీనం చేసుకున్న చెరువు భూభాగం భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లకుండా ఉండేందుకు అధికారులు తక్షణ రక్షణ చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగా చెరువు చుట్టూ శాశ్వత ప్రాతిపదికన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను అధికారులు అక్కడికక్కడే మొదలుపెట్టారు. రాష్ట్రంలో చెరువుల పరిరక్షణ, సహజ నీటి వనరుల సంరక్షణ, భూ ఆక్రమణల నివారణే ధ్యేయంగా ప్రభుత్వం ఈ ప్రత్యేక చర్యలు చేపడుతోందని అధికారులు స్పష్టం చేశారు.

## ఏపీలో ఆక్వా కనెక్షన్లకు విద్యుత్తు సబ్సిడీ

అమరావతి, మే 26 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్లూ ఎకానమీ దిశగా అడుగులు వేస్తూ ఆక్వా రైతులకు భారీ ఊరట కల్పించారు. కొత్త ఆక్వా కనెక్షన్లకు కూడా విద్యుత్ సబ్సీడీ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఇస్తున్న విద్యుత్ సబ్సిడీని కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకు కూడా వర్తింపజేయాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే 50 వేల కనెక్షన్లకు ప్రభుత్వం ఏటా రూ.1,100 కోట్ల సబ్సిడీ భరిస్తోందని, తాజా నిర్ణయంతో మరో రూ.188 కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు. రాష్ట్రంలో ఆక్వా సాగవుతున్న 4 లక్షల ఎకరాలనూ ఆక్వా జోన్ పరిధిలోకి తేవాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఆక్వా రంగాన్ని 'బ్లూ ఎకానమీ'గా అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. నాణ్యత ధృవీకరణ, ట్రేసబిలిటీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. సముద్ర తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు రూ.240 కోట్ల వ్యయంతో 200 అత్యాధునిక మెకనైజ్డ్ బోట్లను కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించి స్థానిక మత్స్యకారుల ఆదాయం పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 90 నియోజకవర్గాల్లో ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసి, 'డిజి రైతు బజార్' యాప్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ సర్కారును అడ్డుకోండి

**భూసేకరణ బాధితులు అరిగోస పడుతున్నరు**

**గవర్నర్‌కు కల్వకుంట్ల కవిత ఫిర్యాదు**

**బాధితులకు న్యాయం జరగకపోతే ఉద్యమిస్తామని వెల్లడి**



హైదరాబాద్, మే 26 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, పరిగి, ఆర్ఆర్ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షిక విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు.

# పవన్ దృష్టికి సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యలు


**ఏపీ డిప్యూటీ సీఎంతో టాలీవుడ్ నిర్మాతల భేటీ**



రాజమండ్రి, మే 26 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంగళవారం రాజమండ్రిలో పలువురు ప్రముఖ టాలీవుడ్ నిర్మాతలు కలిశారు. పర్యటనలో భాగంగా నగరంలోని షెల్టన్ హోటల్‌లో బస చేసిన పవన్‌తో వారు సమావేశమై సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ, ఫైన్ స్క్రీన్స్ నిర్మాత సాహు గారపాటి, కిలారి సతీష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని నిర్మాతలు పవన్ కల్యాణ్‌కు వివరించారు. థియేటర్ యాజమానులు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు మధ్య ఆదాయ పంపకాల (రెవెన్యూ షేరింగ్) విషయంలో నెలకొన్న వివాదాలతో పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. అధిక విద్యుత్ ఛార్జీలు, నిర్వహణ వ్యయంతో చాలా థియేటర్లు మూసివేత అంచున ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకుని, పరిశ్రమకు అండగా నిలవాలని నిర్మాతలు కోరారు. సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడ కోసం ప్రత్యేకంగా ఒక నూతన ఫిలిం పాలసీని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. థియేటర్లకు విద్యుత్ బిల్లులపై రాయితీలు కల్పించాలని కోరారు. నిర్మాతలు చెప్పిన సమస్యలను సానుకూలంగా విన్న పవన్ కల్యాణ్, తెలుగు సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఆయన, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ రాయితీలపై వచ్చిన ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పవన్ సానుకూల స్పందనతో త్వరలోనే తమ సమస్యలు పరిష్కారమవుతాయని టాలీవుడ్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ మోసం

**రియల్ ఎస్టేట్ కుదేలైంది: రాంచందర్ రావు**



హైదరాబాద్, మే 26 (ఈవార్తలు): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తూ పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఎంఐఎం ఒత్తిడికి లొంగి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని దుయ్యబట్టారు. నగరంలో డివిజన్ల ఏర్పాటుపై అధికారులకే క్లారిటీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మజ్లిస్ పార్టీయే ముఖ్యమని, నగర ప్రజలు కాదని విమర్శించారు. భాగ్యనగరంలో తాగునీటి ఎద్దడి, కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, చిన్న వాన పడితేనే నగరం మునిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో నేతలు రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకోగా, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఆ రంగం పూర్తిగా కుదేలైందని రామచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్‌ను నిజమైన విశ్వనగరంగా మార్చడం, అవినీతి రహిత పాలన అందించడం ఒక్క బీజేపీకే సాధ్యమని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పి, బీజేపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఈడీ విచారణకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భార్య, కుమారుడు

విజయవాడ, మే 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై దృష్టి సారించిన ఈడీ... వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల మేరకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఈరోజు ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం మోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఈడీ అధికారులు అడిగిన తమ ఆస్తుల వివరాలన్నింటినీ పూర్తిస్థాయిలో అందజేశామని, దర్యాప్తుకు తమ వంతుగా పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపారు. తమ కుటుంబం సంపాదించిన ప్రతి రూపాయీ కష్టార్జితమే తప్ప... అందులో ఎలాంటి అక్రమ సంపాదన లేదని స్పష్టం చేశారు. ఏపీ సిట్ కేవలం కక్షపూరితంగానే తమపై కేసులు నమోదు చేసిందని ఆయన ఆరోపించారు. ముడుపుల సొమ్ముతో తాము ఆస్తులు కొనుగోలు చేశామనే ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని, ఈ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని చెప్పారు. తాము సంపాదించిన ప్రతి పైసా సక్రమమైనదేనని పేర్కొన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఏపీ పోలీసుల నుంచి నోటీసులు రాలేదు: ప్రొఫెసర్ నాగేశ్వర్

హైదరాబాద్, మే 26 (ఈవార్తలు): ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మంగళవారం తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, తప్పుడు సమాచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు ఆయన వివరించారు. ఇటీవల ఒక టీవీ చర్చా కార్యక్రమంలో పవన్ కల్యాణ్, అమిత్ షా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించి నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను తాను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో జనసేన నాయకుల ఫిర్యాదులతో కాకినాడ, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ఆయనపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ క్రమంలో నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు హైదరాబాద్ వెళ్లారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను ఏపీ ప్రభుత్వం అప్పుడే ఖండించింది. తాజాగా ప్రొఫెసర్ నాగేశ్వర్ స్వయంగా తనకు నోటీసులు రాలేదని చెప్పడంతో ఈ వదంతులకు తెరపడినట్లయింది.



## మా కుమార్తె కేసులో న్యాయం చేయండి

**జగన్‌ను సుగాలి ప్రీతి తల్లిదండ్రుల వేడుకోలు**

తాడేపల్లి, మే 26 (ఈవార్తలు): గత తొమ్మిదేళ్లుగా తమ కుమార్తె కేసులో న్యాయం కోసం పోరాడుతున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్‌లు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ను కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. 2017లో తమ కుమార్తెపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశారని.. ఇన్నేళ్లు గడుస్తున్నా తమకు ఇంకా న్యాయం జరగలేదని వారు జగన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. ఆనాడు వైసీపీ ప్రభుత్వం తమ కుటుంబానికి కర్నూలులో 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ప్రీతి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలిచిందని చెప్పారు. అయితే, ప్రస్తుతం ఈ కేసును పూర్తిగా పక్కనపెట్టేశారని ఆరోపించారు. అంతేకాకుండా, తమకు రావాల్సిన పెన్షన్‌ను కూడా స్థానిక అధికారులు నిలిపివేశారని, కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సాయం అడిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ విచారణ వేగవంతమయ్యేలా తమకు న్యాయ సహాయం అందించాలని వారు కోరారు. బాధిత తల్లిదండ్రుల గోడును సావధానంగా విన్న జగన్, సుగాలి ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ తరపున లీగల్ సపోర్ట్ ఇస్తామని, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని జగన్ భరోసా కల్పించారు.

# చాముండేశ్వరి ఆలయంలో రణ్‌వీర్ క్షమాపణలు

బెంగళూరు: బాలీవుడ్ స్టార్ నటుడు రణ్‌వీర్ సింగ్, తీవ్ర వివాదాస్పదమైన 'కాంతార' మిమిక్రీ వివాదానికి ముగింపు పలికారు. కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం కర్ణాటకలోని చాముండి కొండపై వెలసిన చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. గర్భగుడిలో అమ్మవారికి క్షమాపణలు తెలిపి, ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కు తీర్చుకున్నారు. దీంతో ఈ వివాదం పూర్తిగా సద్దుమణిగింది. కొన్ని నెలల క్రితం గోవాలో జరిగిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ వివాదం మొదలైంది. 'కాంతార' చిత్రంలోని పవిత్రమైన 'దైవ' పాత్రను రణ్‌వీర్ సింగ్ అగౌరవపరిచేలా అనుకరించారని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. నటుడు రిషబ్ శెట్టి వారించినా రణ్‌వీర్ తన మిమిక్రీని ఆపలేదని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై కర్ణాటక హైకోర్టులో ఫిర్యాదు దాఖలు కాగా, న్యాయస్థానం రణ్‌వీర్ తీరును తప్పుబట్టింది. అయితే, రణ్‌వీర్ కోర్టుకు క్షమాపణ చెప్పడంతో ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. నాలుగు వారాల్లోగా చాముండేశ్వరి ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి క్షమాపణలు చెప్పాలనే షరతు విధించింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం ఆలయానికి చేరుకున్న రణ్‌వీర్, పూజలతో తన మొక్కు తీర్చుకున్నారు.

## బంగ్లాదేశీ చొరబాటుదారులూ పారిపోండి..!

**పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అల్టిమేటం**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో, అంతర్గత భద్రతా వ్యవహారాలలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీ వలసదారులకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అక్రమ చొరబాటుదారులను ఏరిపారేసే చర్యలను ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశిస్తూ.. "బంగ్లాదేశీ చొరబాటుదారులు ఎవరైనా ఉంటే వేగంగా ఇక్కడి నుంచి పారిపోండి. మిమ్మల్ని జైళ్లలో పెట్టి, మా ప్రజాధనంతో తిండి పెట్టి పోషించడం మాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. మా డబ్బును ఎందుకు వృథా చేయాలి?" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ప్రధాన ఎన్నికల హామీలలో ఒకటైన అక్రమ వలసదారుల ఏరివేతపై ఇప్పుడు సువేందు సర్కార్ పూర్తిస్థాయిలో యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చొరబాటుదారులను గుర్తించి, వారిని నిర్బంధించడానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశీయులతో పాటు రోహింగ్యాలను కూడా కచ్చితంగా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. ఈ మేరకు బెంగాల్‌లోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి లిఖితపూర్వక మార్గదర్శకాలు జారీ అయ్యాయి. నిర్బంధ కేంద్రాల ఏర్పాటు కోసం అనువైన స్థలాలను తక్షణమే అన్వేషించాలని జిల్లా యంత్రాంగాలను ఆదేశించారు. ముఖ్యమంత్రి సువేందు అధికారి ఇచ్చిన ఈ గట్టి వార్నింగ్‌తో పశ్చిమ బెంగాల్ సరిహద్దు జిల్లాలైన ఉత్తర 24 పరగణాలు, మాల్దా వంటి ప్రాంతాలలో అప్పుడే చలనం మొదలైంది. చాలామంది అక్రమ వలసదారులు తమ సొంత దేశానికి తిరిగి వెళ్ళిపోవడానికి సరిహద్దుల వైపునకు కదులుతున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. పట్టుబడిన చొరబాటుదారుల గుర్తింపును నిర్ధారించిన తర్వాత, చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి వారిని తిరిగి బంగ్లాదేశ్ పంపివేయడానికి ప్రభుత్వం సర్వసిద్ధం అవుతోంది. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా మరోసారి అక్రమ వలసల అంశంపై పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది.

## జాడలేని నైరుతి

**తప్పిన ఐఎండీ అంచనా.. కేరళను తాకని రుతుపవనాలు**

**జూన్ 2 నుంచి 4 మధ్య ప్రవేశించే అవకాశం**

**ఐఎండీ తాజా అంచనా**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతులు, ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానుంది. మే 26న కేరళ తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందుగా అంచనా వేసినప్పటికీ, అందుకు అనువైన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని తెలుస్తోంది. దీంతో రుతుపవనాలు సాధారణ తేదీ అయిన జూన్ 1 కంటే కొద్దిగా ఆలస్యంగా, అంటే జూన్ 2 నుంచి 4 మధ్య కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తాజా అంచనాలు సూచిస్తున్నాయి. రుతుపవనాల ఆగమనాన్ని ప్రకటించడానికి కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు అవసరం. కేరళలోని 14 కేంద్రాలలో కనీసం 60 శాతం కేంద్రాల్లో వరుసగా రెండు రోజుల పాటు 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. దీంతో పాటు గాలి వేగం, మేఘాల సాంద్రత వంటివి కూడా అనుకూలంగా ఉండాలి. అయితే, మే 25 నాటికి ఈ పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం కేరళలోని తిరువనంతపురం, కొల్లాం, అలప్పుళ, ఎర్నాకుళం జిల్లాల్లో సాధారణంగా కురిసే తొలకరి జల్లులు పడుతున్నాయి. ఒకవైపు రుతుపవనాల రాక ఆలస్యం అవుతుండగా, మరోవైపు ఉత్తర, మధ్య, పశ్చిమ భారతదేశంలో తీవ్రమైన వేడిగాలులు ప్రజలను అల్లాడిస్తున్నాయి. ఢిల్లీలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయి. రుతుపవనాలు కేరళను తాకిన తర్వాత కూడా, ఉత్తర దిశగా వాటి కదలిక నెమ్మదిగా, తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో, కొన్ని రోజుల ఆలస్యం పెద్ద సమస్య కాకపోయినా, మొత్తం సీజన్‌లో వర్షపాతం ఎలా ఉంటుందనేది ఆందోళన కలిగిస్తోంది. దేశ వార్షిక వర్షపాతంలో 70 శాతం వాటా అందించే నైరుతి రుతుపవనాల కదలికపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

## మరో అన్నాడీఎంకే ఎమ్మెల్యే రిజైన్

**అంబసముద్రం ఎమ్మెల్యే ఈసక్కి సుబ్బయ్య రాజీనామా**

చెన్నై: తమిళనాడులో అన్నాడీఎంకేలో అంతర్గత సంక్షోభం మరింత ముదురుతోంది. పార్టీలో నెలకొన్న విభేదాలతో ఎమ్మెల్యేల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా మంగళవారం నాడు మాజీ మంత్రి, అంబసముద్రం ఎమ్మెల్యే ఈసక్కి సుబ్బయ్య తన పదవికి రాజీనామా చేశారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ నుంచి తప్పుకున్న నాలుగో ఎమ్మెల్యే కావడం గమనార్హం. సుబ్బయ్య త్వరలోనే అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిసి సుబ్బయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. తొలుత ఆయన టైప్ చేసిన లేఖను ఇవ్వగా స్పీకర్ నిరాకరించారు. స్వదస్తూరితో రాసిన లేఖను ఇవ్వాలని సూచించారు. దీంతో సుబ్బయ్య వెంటనే చేతితో రాసి రాజీనామా లేఖను అందించగా, దానిని స్పీకర్ ఆమోదించారు.

## సరిహద్దులో 500 మంది ఉగ్రవాదులు

**అల్లర్లకు లష్కరే వ్యూహాలు.. పీవోకే సరిహద్దుల్లో లాంచ్ ప్యాడ్స్ పెంపు కుట్ర**

శ్రీనగర్: కశ్మీర్ అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చి అలజడి సృష్టించేందుకు ఉగ్రవాద సంస్థ 'లష్కరే తోయిబా' సరికొత్త కుట్రలకు తెరలేపింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్యను పెంచడం, అదే సమయంలో ప్రచార యుద్ధాన్ని ఉద్ధృతం చేయడం అనే ద్విముఖ వ్యూహంతో ముందుకు వెళుతున్నట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ మేరకు పాక్ రాజకీయ ప్రముఖులతో లష్కరే అగ్రనాయకత్వం వరుసగా జరుపుతున్న భేటీలు భారత ఏజెన్సీల నిఘాలో పడ్డాయి. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లోకి చొరబడటానికి పీఓకే సరిహద్దుల్లో దాదాపు 500 మందికి పైగా లష్కరే ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల భారత భద్రతా దళాల అప్రమత్తత కారణంగా ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాలన్నీ విఫలమవడంతో లష్కరే నాయకత్వం తీవ్ర అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్యను పెంచి, అక్కడ ఉగ్రవాదుల సంఖ్యను వెయ్యికి చేర్చాలని పీఓకేలో జరిగిన ఓ కీలక సమావేశంలో లష్కరే నిర్ణయించినట్లు గుర్తించారు.

# ఖాదీకి మస్తు గిరాకీ



**గత ఏడాది రూ.1.87 లక్షల కోట్ల టర్నోవర్.. కేవీఐసీ చైర్మన్ మనోజ్ కుమార్ వెల్లడి**

న్యూఢిల్లీ, మే 26 (పీఐబీ): ప్రధాని మోదీ నాయకత్వంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రంగం 2025-26 ఆర్థిక సంవత్సరంలో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) విడుదల చేసిన తాజా తాత్కాలిక గణాంకాల ప్రకారం, ఖాదీ-గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల మొత్తం టర్నోవర్ తొలిసారిగా రూ.1.87 లక్షల కోట్ల మార్కును దాటింది. న్యూఢిల్లీలోని గాంధీ దర్శన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కేవీఐసీ చైర్మన్ మనోజ్ కుమార్ ఈ గణాంకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఖాదీ కేవలం సంప్రదాయ వస్త్రం కాదు; ఇది ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రతీకగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా మారింది' అని పేర్కొన్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.31,154 కోట్లుగా ఉన్న ఖాదీ-గ్రామీణ పరిశ్రమల అమ్మకాలు, 2025-26 నాటికి రూ.1,87,105 కోట్లకు చేరుకుని 501 శాతం వృద్ధిని నమోదు చేశాయన్నారు. అదే సమయంలో ఉత్పత్తి విలువ రూ.26,109 కోట్ల నుంచి రూ.1,25,296 కోట్లకు పెరిగి 380 శాతం వృద్ధి సాధించిందని వివరించారు. 'ఉపాధి కల్పనలో కూడా ఈ రంగం విశేష పురోగతి సాధించింది. 2013-14లో 1.30 కోట్ల మందికి ఉపాధి లభిస్తుండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.04 కోట్లకు చేరుకుంది. అంటే 56 శాతం వృద్ధి నమోదైంది. ఖాదీ వస్త్రాల రంగంలో కూడా గణనీయమైన వృద్ధి కనిపించింది. 2013-14లో రూ.811 కోట్లుగా ఉన్న ఖాదీ ఉత్పత్తి, 2025-26 నాటికి రూ.3,974 కోట్లకు పెరిగింది. అదే సమయంలో అమ్మకాలు రూ.1,081 కోట్ల నుంచి రూ.7,869 కోట్లకు చేరుకుని 628 శాతం పెరుగుదల నమోదైంది. ఈ విజయాలకు 'ఆత్మనిర్భర్ భారత్', 'వోకల్ ఫర్ లోకల్', 'లోకల్ టు గ్లోబల్' వంటి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రధాన కారణం' అని ఆయన పేర్కొన్నారు.

**పీఎంఈజీపీ ద్వారా లక్షలాది ఉద్యోగాలు**

ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) కింద 2025-26లో 66,494 కొత్త యూనిట్లు స్థాపించగా, వీటి ద్వారా 7.31 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించాయి. మహిళా సాధికారతకు కూడా ఈ రంగం కీలకంగా మారింది. వివిధ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన్న వారిలో సుమారు 59 శాతం మహిళలే ఉండటం విశేషం. ఖాదీ కళాకారుల ఆదాయంలో కూడా గణనీయమైన పెరుగుదల నమోదైంది. 2013-14లో ఒక్క హాంక్‌కు రూ.4గా ఉన్న పారితోషికం ప్రస్తుతం రూ.15కు పెరిగింది. దీంతో కళాకారుల ఆదాయం సుమారు 275 శాతం పెరిగినట్లు కేవీఐసీ వెల్లడించింది. గ్రామీణ భారత ఆర్థికాభివృద్ధికి ఖాదీ రంగం కీలక శక్తిగా మారుతున్నదని, స్వదేశీ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ ఈ విజయానికి నిదర్శనమని మనోజ్ కుమార్ పేర్కొన్నారు.

# అమెరికానే అన్నదాత!

**తర్వాతి స్థానాల్లో బ్రెజిల్, చైనా**

**8వ స్థానంలో భారతదేశం**

**ఆహార ఎగుమతుల్లో టాప్**

**10 దేశాలదే సగం వాటా**

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలకు ఆహారాన్ని అందిస్తున్న వ్యవసాయ ఎగుమతిదారుల జాబితాలో అమెరికా, బ్రెజిల్, చైనా అగ్రస్థానంలో నిలిచాయి. 2024 సంవత్సరానికి చెందిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) గణాంకాల ఆధారంగా రూపొందించిన ఈ ర్యాంకింగులలో భారత్ టాప్ 10లో చోటు దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఆహార సరఫరా గొలుసు కొద్ది దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. వివరాల్లోకి వెళ్తే, 2024లో 181.3 బిలియన్ డాలర్ల ఎగుమతులతో అమెరికా మొదటి స్థానంలో నిలవగా, 144.4 బిలియన్ డాలర్లతో బ్రెజిల్ రెండో స్థానం, 74.8 బిలియన్ డాలర్లతో చైనా మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఇక 45.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 3.8 లక్షల కోట్లు) విలువైన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసిన భారత్, ఈ జాబితాలో 8వ స్థానంలో నిలిచింది. ప్రపంచ మొత్తం ఎగుమతుల్లో భారత్ వాటా 3 శాతంగా ఉంది. ప్రపంచ ఆహార ఎగుమతుల మార్కెట్ విలువ సుమారు 1.5 ట్రిలియన్ డాలర్లు కాగా, ఇందులో 80 శాతానికి పైగా వాటా కేవలం 30 దేశాలదే కావడం గమనార్హం. ముఖ్యంగా అమెరికా, బ్రెజిల్, కెనడా, మెక్సికో దేశాలు కలిపి దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉన్నాయి. పెరుగుతున్న రవాణా, ఎరువుల ఖర్చులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆహార ఎగుమతులు వ్యూహాత్మకంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారీ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులను పండించే చైనా, అధికశాతం దేశీయ అవసరాలకే వినియోగించుకోవడం వల్ల ఎగుమతుల్లో వెనుకబడింది.



### టాప్ 15 ఆహార ఎగుమతి దేశాలు

ఈ నివేదిక ప్రకారం ప్రపంచంలోని టాప్ 15 ఆహార ఎగుమతిదారుల జాబితా ఇక్కడ ఉంది.

1. అమెరికా: 181.3 బిలియన్ డాలర్లు (12.1% వాటా)
2. బ్రెజిల్: 144.4 బిలియన్ డాలర్లు (9.7% వాటా)
3. చైనా: 74.8 బిలియన్ డాలర్లు (5.0% వాటా)
4. కెనడా: 66.3 బిలియన్ డాలర్లు (4.4% వాటా)
5. మెక్సికో: 49.9 బిలియన్ డాలర్లు (3.3% వాటా)
6. ఇండోనేషియా: 49.7 బిలియన్ డాలర్లు (3.3% వాటా)
7. ఆస్ట్రేలియా: 45.8 బిలియన్ డాలర్లు (3.1% వాటా)
8. భారత్: 45.5 బిలియన్ డాలర్లు (3.0% వాటా)
9. థాయ్‌లాండ్: 41.8 బిలియన్ డాలర్లు (2.8% వాటా)
10. ఫ్రాన్స్: 38.7 బిలియన్ డాలర్లు (2.6% వాటా)
11. నెదర్లాండ్స్: 37.3 బిలియన్ డాలర్లు (2.5% వాటా)
12. అర్జెంటీనా: 34.8 బిలియన్ డాలర్లు (2.3% వాటా)
13. మలేషియా: 33.5 బిలియన్ డాలర్లు (2.2% వాటా)
14. టర్కియే: 31.4 బిలియన్ డాలర్లు (2.1% వాటా)
15. యునైటెడ్ కింగ్‌డమ్: 30.9బిలియన్ డాలర్లు (2.1% వాటా)



## రోదసిలోకి కృత్రిమ మానవ పిండాలు

**సరికొత్త ప్రయోగానికి చైనా శ్రీకారం**

బీజింగ్: మానవ భవిష్యత్తు, అంతరిక్ష పరిశోధనల చరిత్రలో చైనా ఒక కీలక ముందడుగు వేసింది. తొలిసారిగా మానవ కృత్రిమ పిండాలను అంతరిక్షంలోకి పంపి, వాటి అభివృద్ధిపై ఒక సంచలన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. మే 10న లాంగ్ మార్చ్ 7 రాకెట్ ద్వారా ప్రయోగించిన తియాన్‌జౌ-10 మిషన్, ఈ కృత్రిమ పిండాలను తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్‌కు విజయవంతంగా చేర్చింది. అంతరిక్ష కేంద్రంలో సూక్ష్మ గురుత్వాకర్షణ (మైక్రోగ్రావిటీ) వాతావరణంలో ఈ పిండాల నమూనాలు సుమారు 5 రోజుల పాటు అభివృద్ధి చెందాయి. అనంతరం, తదుపరి విశ్లేషణ కోసం వాటిని ప్రత్యేక పద్ధతిలో భద్రపరిచారు. ఇదే సమయంలో భూమిపై కూడా కొన్ని నమూనాలను పెంచి, అంతరిక్షంలోని వాటితో పోల్చి చూడనున్నారు. ఈ ప్రయోగంలో భాగంగా జెబ్రాఫిష్, ఎలుకల పిండాలను కూడా పంపారు. అయితే, ఇవి నిజమైన మానవ పిండాలు కావని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిశోధకులు స్పష్టం చేశారు. మానవ మూల కణాల నుంచి ప్రయోగశాలలో సృష్టించిన ఈ నమూనాలు, పిండం అభివృద్ధిలోని తొలి దశలను (సుమారు 14-21 రోజులు) మాత్రమే పోలి ఉంటాయని, ఇవి శిశువుగా మారే అవకాశం లేదని తేల్చి చెప్పారు. అంతరిక్షంలో ఉండే తీవ్రమైన రేడియేషన్, గురుత్వాకర్షణ లేకపోవడం వంటి పరిస్థితులు మానవ పునరుత్పత్తిపై ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలుసుకోవడమే ఈ ప్రయోగం ముఖ్య ఉద్దేశం. భవిష్యత్తులో చంద్రుడు, అంగారకుడిపై మానవ కాలనీలు ఏర్పాటు చేయాలన్నా, సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణాలు చేపట్టాలన్నా ఈ తరహా పరిశోధనలు అత్యంత కీలకం కానున్నాయి. ఈ ప్రయోగం ఫలితాలు, అంతరిక్షంలో మానవ మనుగడకు సంబంధించిన అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## ఆమెకు 40, అతడికి 14.. ఆన్‌లైన్‌లో పెళ్లి!

**గోరఖ్‌పూర్‌లో వింత ఘటన**

**పోలీసుల జోక్యంతో ముగిసిన ప్రేమ కాని కథ**

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లో ఒక విచిత్రమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన 14 ఏళ్ల బాలుడు తనను ఆన్‌లైన్‌లో పెళ్లి చేసుకుని, ఇప్పుడు తనతో కలిసి ఉండటానికి నిరాకరిస్తున్నాడని 40 ఏళ్ల మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నలుగురు పిల్లలకు తల్లి అయిన ఆమె ఫిర్యాదుతో పోలీసులు సైతం ఆశ్చర్యపోయారు. వివరాల్లోకి వెళ్తే... గోరఖ్‌పూర్‌కు చెందిన 40 ఏళ్ల మహిళ ప్రస్తుతం మహరాజ్‌గంజ్‌లో నివసిస్తోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూసే అలవాటు ఉంది. ఈ క్రమంలో చెన్నైలో తండ్రితో కలిసి ఉంటున్న 14 ఏళ్ల బాలుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఒకరి రీల్స్‌ను మరొకరు ఇష్టపడటంతో మొదలైన వీరి పరిచయం, కొద్దికాలానికే ప్రేమగా మారింది. ఆ బాలుడు తన పెద్ద కొడుకు కన్నా ఐదేళ్లు చిన్నవాడని తెలిసినా, ఆమె బంధాన్ని కొనసాగించింది. ఇటీవల ఆ బాలుడు తనను వదిలేశాడని ఆరోపిస్తూ, ఆమె నౌతన్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తమకు ఆన్‌లైన్‌లో పెళ్లి జరిగిందని, ఇప్పుడు అతను తనతో కాపురం చేయడానికి ఒప్పుకోవడం లేదని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది.

# కీవ్‌ను తక్షణమే వీడండి

**అమెరికా సహా విదేశీ దౌత్యవేత్తలకు రష్యా హెచ్చరికలు**

**ఉక్రెయిన్‌పై దాడులు తీవ్రం చేస్తామని స్పష్టీకరణ**

మాస్కో: అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం అత్యంత ప్రమాదకరమైన మలుపు తిరిగింది. గత నాలుగేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇటీవల ఉక్రెయిన్‌పై సరికొత్త హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణి 'ఒరెష్నిక్'తో విరుచుకుపడిన రష్యా.. రాబోయే రోజుల్లో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై కంటిచూపుతోనే శాసించే స్థాయి భారీ దాడులు చేయబోతున్నామంటూ అధికారికంగా హెచ్చరించింది. అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక నిర్ణయాలు తీసుకునే పరిపాలనా భవనాలు, కమాండ్ సెంటర్లు, రక్షణ రంగ పరిశ్రమలు, డ్రోన్ తయారీ కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు ఉంటాయని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కీవ్ నగరంలో ఉన్న విదేశీ దౌత్యవేత్తలు, అంతర్జాతీయ సంస్థల సిబ్బంది తక్షణమే నగరాన్ని వీడి వెళ్లాలని రష్యా అల్టిమేటం జారీ చేసింది. ఈ ఉద్రిక్తతల మధ్య సోమవారం ఒక కీలకమైన దౌత్యపరమైన పరిణామం చోటుచేసుకుంది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో ఫోన్‌లో మాట్లాడారు. కీవ్‌పై ముమ్మందు జరగబోయే దాడుల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని, కాబట్టి అక్కడ ఉన్న అమెరికా దౌత్య సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు ఖాళీ చేయించాలని రూబియోకు లావ్రోవ్ సూచించారు. మిలిటరీ, ప్రభుత్వ భవనాలకు సాధారణ పౌరులు కూడా వీలైనంత దూరంగా ఉండాలని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. అయితే రష్యా ఇలాంటి హెచ్చరికలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో మే నెల ప్రారంభంలో కూడా తమ రెడ్ స్క్వేర్ మిలిటరీ పరేడ్‌కు అంతరాయం కలిగిస్తే కీవ్‌ను సర్వనాశనం చేస్తామని పుతిన్ సర్కార్ హెచ్చరించింది. రష్యా చేస్తున్న ఇటువంటి మైండ్ గేమ్స్, బెదిరింపులకు తాము భయపడే ప్రసక్తే లేదని, తమ భూభాగాన్ని కాపాడుకుంటామని ఉక్రెయిన్ ఈ ప్రకటనలను ఎప్పటికప్పుడు కొట్టిపారేస్తోంది. ఏదేమైనా రష్యా తాజా వ్యూహం చూస్తుంటే కీవ్ నగరంపై మరికొన్ని రోజుల్లోనే క్షిపణుల వర్షం కురవబోతోందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు

ముంబై: సోమవారం ట్రేడింగ్‌లో భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దక్షిణ ఇరాన్‌లో అమెరికా తాజాగా దాడులు జరపడంతో శాంతి ఒప్పందం ఆశలు సన్నగిల్లాయి. ఈ పరిణామం మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 479.26 పాయింట్లు (0.63%) నష్టపోయి 76,009.7 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 118 పాయింట్లు (0.49%) పతనమై 23,913.7 వద్ద ముగిసింది. అమెరికా దళాలను ఇరాన్ నుంచి కాపాడేందుకే ఈ రక్షణాత్మక దాడులు జరిపినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ అనిశ్చితితో మదుపరులు అప్రమత్తత వహించారు. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 24,000 పాయింట్ల స్థాయి తక్షణ నిరోధకంగా మారింది.

దీనిపైన 24,100 వద్ద కాల్ రైటింగ్ ఎక్కువగా ఉండటంతో అమ్మకాల ఒత్తిడి కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. ఇక దిగువన, 23,850 తక్షణ మద్దతుగా, 23,500-23,600 జోన్ కీలక డిమాండ్ ఏరియాగా ఉంది. సెక్టార్ల వారీగా చూస్తే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 1 శాతానికి పైగా నష్టపోయి అత్యంత బలహీనంగా నిలిచింది. ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా క్షీణించాయి. అయితే, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.54%, 0.35% లాభాలతో రాణించడం విశేషం. మెటల్, కెమికల్ స్టాక్స్ కూడా లాభపడ్డాయి. సెన్సెక్స్‌లో ట్రెంట్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్ నష్టపోగా, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా లాభపడ్డాయి.

## భారతీయ మహిళ దారుణ హత్య

**అమెరికాలోని వర్జీనియాలో కాల్చి చంపిన దుండగుడు**

వర్జీనియా: అమెరికాలో మరో భారతీయ సంతతి మహిళ దారుణ హత్యకు గురయ్యారు. వర్జీనియాలోని ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్న గుజరాత్‌కు చెందిన మహిళపై దుండగుడు కాల్పులు జరిపి హతమార్చాడు. దోపిడీ యత్నంలో ఈ ఘాతుకం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మృతురాలి కుటుంబ సభ్యులు ధృవీకరించారు. మృతురాలిని మేఘనాబెన్ పటేల్ (45)గా గుర్తించారు. ఆమె గుజరాత్‌లోని మెహసానా జిల్లా, విసాపూర్ తాలూకాలోని జంత్రాల్ గ్రామానికి చెందినవారు. గత పదేళ్లుగా వర్జీనియాలోని ఈ సూపర్‌మార్కెట్‌లో ఆమె పనిచేస్తున్నారు. మేఘనాబెన్ తల్లిదండ్రులు కర్సన్‌భాయ్ పటేల్, కపిలాబెన్ ప్రస్తుతం జంత్రాల్ గ్రామంలోనే నివసిస్తున్నారు. ఈ దారుణ ఘటన మొత్తం స్టోర్‌లోని సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. వీడియోలోని దృశ్యాల ఆధారంగా.. జంతువుల చర్మం ప్రింట్ ఉన్న ప్యాంటు, గ్రే జాకెట్ ధరించిన ఓ వ్యక్తి ముఖానికి ముసుగుతో స్టోర్‌లోకి ప్రవేశించాడు. ఆ సమయంలో స్టోర్‌లో జనం ఎవరూ లేరు. అతను నేరుగా కౌంటర్ వద్దకు వచ్చి మేఘనాబెన్‌తో మాటలు కలిపాడు. కొద్దిసేపటి తర్వాత అనూహ్యంగా జేబులోంచి తుపాకీ తీసి ఆమెపై కాల్పులు జరిపాడు. కాల్పులతో ఆమె కిందపడిపోగానే, నిందితుడు అంతటితో ఆగలేదు. కౌంటర్ పైనుంచి దూకి ఆమెపైకి వంగి మరిన్ని రౌండ్లు కాల్పులు జరిపినట్లు వీడియోలో స్పష్టంగా కనిపించింది. అనంతరం నిందితుడు వచ్చిన దారిలోనే పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మేఘనాబెన్‌కు భర్త ఉపేంద్రభాయ్ పటేల్, కుమార్తె నక్షీబెన్, కుమారుడు స్మిత్ ఉన్నారు. ఈ ఘటనతో అమెరికాలోని భారతీయ సమాజంలో విషాదం నెలకొంది.

# వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు విజయవంతం

## విజేతలకు బహుమతులు ప్రదానం.. క్రీడలతోనే ఆరోగ్యకరమైన సమాజం: నార్నె శ్రీనివాసరావు

హైదరాబాద్, మే 26: వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎస్ఎల్‌వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలు ఘనంగా ముగిశాయి. అన్ని వయో విభాగాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, కార్యదర్శి యు.వి.ఎన్. బాబు, కోశాధికారి పీ.వి.ఎల్. కుమార్‌తో పాటు పలువురు క్రీడా నిర్వాహకులు, అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులు విజయం--పరాజయాలను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఓటమిని నిరాశగా కాకుండా అనుభవంగా తీసుకుని నిరంతర సాధన చేస్తే విజయాలు సాధించవచ్చన్నారు. క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి సాధన చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు ఆడుకునే స్థలాలు తగ్గిపోతుండటం ఆందోళనకరమన్నారు. విద్యాసంస్థలు వాణిజ్య ధోరణిలో నడుస్తుండటంతో విద్యార్థులకు క్రీడల అవకాశాలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, క్రీడాకారులను ప్రోత్సహించే సంస్థలు అభినందనీయమని చెప్పారు. ప్రభుత్వాలు కూడా క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. యువత



క్రీడల వైపు ఆసక్తి చూపించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పోటీలలో కైవల్య అండర్-19 విభాగంలో ఛాంపియన్‌గా నిలవగా, అనేకళ్ల భవేశ్ రెడ్డి అండర్-17 విభాగంలో, అద్వైత్ సత్తు అండర్-15 విభాగంలో జిల్లా ఛాంపియన్లుగా నిలిచి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమం అనంతరం విజేతలు, క్రీడాకారులు, నిర్వాహకులతో కలిసి అతిథులు స్మారక చిత్రాలు దిగారు. వికారాబాద్ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి ఈ పోటీలు మరింత దోహదపడతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## డ్రైవర్ అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

**ఆర్టీసీ డిపో మేనేజర్‌కు బీఆర్ఎస్ నేతల డిమాండ్**

జగిత్యాల, మే 26 (ఈవార్తలు): ఇటీవల జగిత్యాలలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ధర్నా సమయంలో వ్యాఖ్యలు చేసిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్ జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్ అశోక్‌ను సస్పెండ్ చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. వెంటనే అశోక్‌ను విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



## డ్రైవర్ అశోక్‌పై వేటు సరికాదు

**అశోక్ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుంది**

**జగిత్యాల బీజేపీ ఇంచార్జి భోగ శ్రావణి వెల్లడి**

**ఫోన్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్ పరామర్శ**

జగిత్యాల, మే 26 (ఈవార్తలు): ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. మంగళవారం డ్రైవర్ అశోక్‌ను పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రతి సామాన్యుడికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందని, ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురి చేయడం సరైన విధానం కాదన్నారు. వెంటనే అశోక్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్థానిక నాయకుల సహకారంతో డ్రైవర్ అశోక్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. పార్టీ తరపున, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, ప్రభుత్వం ఏర్పాటు అనంతరం అశోక్ ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొన్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేముల శ్రీనివాస్, సుంచు సురేష్, శ్రీపతి రమేష్, పవన్ సింగ్, ఇట్యాల రాము, సిరిపురం శ్రీనివాస్, గట్టపల్లి జ్ఞానేశ్వర్, కాసెట్టి తిరుపతి, శివ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## బక్రీద్ ఏర్పాట్లపై చైర్‌పర్సన్ సమీక్ష

జగిత్యాల, మే 26 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బక్రీద్ పండుగ ఏర్పాట్లపై మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మునీరొద్దీన్, ముస్లిం కౌన్సిలర్లు, కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వాణి మాట్లాడుతూ పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగను ప్రశాంతమైన, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకునేలా మున్సిపాలిటీ తరపున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదర సోదరీమణులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఖాజా కమాలొద్దీన్, షాహిన్ బేగం, అనీస్ కుతేజా, క్యాదాసు నవీన్, వేముల శ్రీనివాస్, వసీక్ ఉద్దీన్ అన్సారీ, కో-ఆప్షన్ సభ్యురాలు తస్లీం సుల్తానా, ముస్లిం మైనారిటీ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ బారీ, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## కాలిపోయిన ఈత తాటివనానికి ప్రభుత్వం అండ

**నర్సింగాపూర్‌లో పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్**

జగిత్యాల రూరల్, మే 26 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు కాలిపోయిన ఈత తాటివనాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు. బాధిత గీత కార్మికులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 200 ఈత తాటి చెట్లు కాలిపోవడం బాధాకరమన్నారు. గీత కార్మికుల వృత్తి ఎంతో సాహసోపేతమైనదని, ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈత తాటివనంలో ఎమ్మెల్యే నిధులతో బోర్ మంజూరు చేయడంతో పాటు అవసరమైన ఈత తాటి మొక్కలు నాటేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కాటమయ్య కిట్లు అందిస్తోందన్నారు. రైతులు వరి కొయ్యలు, పంట వ్యర్థాలు కాల్చవద్దని సూచించారు. వాటివల్ల కాలుష్యం పెరుగుతుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.25 వేల వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమేది?

**బీజేపీ నేత భోగ శ్రావణి ఫైర్**

జగిత్యాల, మే 26 (ఈవార్తలు): ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించే గొంతుకలను అణచివేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా మారిందని, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం 'కమలనిలయం'లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శాంతియుతంగా నిర్వహించనున్న నిరాహార దీక్షలకు అనుమతులు నిరాకరిస్తూ, అధికార పార్టీ చేపట్టే కార్యక్రమాలకు మాత్రం అనుమతులు ఇవ్వడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన ధర్నాలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. అత్యవసర సేవలకు సంబంధించిన మెడికల్ షాపులను కూడా మూసివేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ ఇబ్బందులకు గురి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందని విమర్శించారు. వెంటనే ఆర్టీసీ డ్రైవర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రీయ విద్యాలయం కోసం స్థలం కేటాయింపు విషయంలో కూడా రాజకీయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నియోజకవర్గ సమస్యలపై జిల్లా మంత్రి స్పందించకపోవడం బాధాకరమన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## గంగాధర కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మంత్రి మహేందర్

గంగాధర, మే 26 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మంత్రి మహేందర్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చొప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిలుస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గంగాధర మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం చేస్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు, మండల కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



## రోడ్లపై పశువులు వదిలితే కఠిన చర్యలు

**నాలుగు ఆవులను గోశాలకు తరలించిన అధికారులు**

ధర్మపురి, మే 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో రోడ్లపై నిర్లక్ష్యంగా వదిలిన పశువులపై పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలు, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనల మేరకు ధర్మపురి సీఐ ఎ. రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై జి. మహేష్ చర్యలను ముమ్మరం చేశారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కొంతమంది యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పట్టణంలోని ప్రధాన రహదారులపై సంచరిస్తున్న నాలుగు ఆవులను గుర్తించి గోశాలకు తరలించారు. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు పశువుల సంరక్షణ దృష్ట్యా ఆవులు, ఎద్దులు, బర్రెలను రోడ్లపై వదలకుండా యజమానులు తమ ఇళ్ల వద్దనే కట్టివేసుకోవాలని అధికారులు సూచించారు. రోడ్లపై పశువులు తిరగడం వల్ల వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇకపై కూడా రోడ్లపై ఒంటరిగా సంచరించే పశువులను స్వాధీనం చేసుకుని గోశాలలకు తరలించడంతో పాటు సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రత పరిరక్షణలో ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.



## కేవీకి నర్సింగాపూర్‌లో స్థలం కేటాయింపు

**ఎడ్యుకేషన్ హబ్‌గా జగిత్యాల.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల బ్యూరో, మే 26 (ఈవార్తలు): జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయం కోసం నర్సింగాపూర్ శివారులోని సర్వే నంబర్--437లో స్థలాన్ని కేటాయిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి మంత్రి నర్సింగాపూర్‌లో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని నర్సింగాపూర్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇందుకోసం సర్వే నంబర్--437లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రూ.33 కోట్ల వ్యయంతో ఐటీఐ, ఏటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వృద్ధాశ్రమం నిర్మాణం కూడా చేపడుతున్నామని వివరించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. చల్‌గల్ ప్రాంతంలోని వ్యవసాయ పరిశోధనలకు సంబంధించిన భూముల్లో 12 ఎకరాలను కేంద్రీయ విద్యాలయం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ల కోసం కేటాయించినట్లు మంత్రి తెలిపారు. అయితే, కేంద్రీయ విద్యాలయానికి రెండు ఎకరాల స్థలం సరిపోదనే వివాదాల నేపథ్యంలో నర్సింగాపూర్‌లో ప్రభుత్వ భూమిని కేటాయిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ పరిశోధనల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని చల్‌గల్ ప్రాంత భూములను మరింతగా కేటాయించే అవకాశం లేదని స్పష్టం చేశారు. నర్సింగాపూర్ భూముల ప్రతిపాదనలను జిల్లా అధికారుల ద్వారా కేంద్రీయ విద్యాలయ అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ అంశంలో సహకరించాలని ధర్మపురి అరవింద్‌ను మంత్రి కోరారు.

## హెచ్‌టీ సర్వీసులకు సింగిల్ విండో వ్యవస్థ

**వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శక సేవలు**



జగిత్యాల, మే 26 (ఈవార్తలు): హైటెన్షన్ (హెచ్‌టీ) 11 కేవీ, 33 కేవీ మరియు అంతకంటే అధిక వోల్టేజ్ విద్యుత్ సర్వీసుల మంజూరును మరింత వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థ కీలకంగా ఉపయోగపడుతుందని జగిత్యాల సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హెచ్‌టీ సర్వీసుల ప్రక్రియను సరళీకృతం చేయడంలో భాగంగా కార్పొరేట్, సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెచ్‌టీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 11 కేవీ వోల్టేజ్ దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలోని ఏడీఈ (కమర్షియల్) అధికారి పర్యవేక్షిస్తారని, 33 కేవీ మరియు అంతకంటే అధిక వోల్టేజ్ దరఖాస్తులను కార్పొరేట్ కార్యాలయంలోని ఏడీఈ (కమర్షియల్) అధికారి పర్యవేక్షణలో ఉంచుతారని తెలిపారు. టీజీ ఐపాస్ పరిధిలోకి రాని హెచ్‌టీ దరఖాస్తుదారులు టీజీఎస్పీడీసీఎల్ అధికారిక పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పూర్తయిన వెంటనే ప్రత్యేక అప్లికేషన్ నంబర్ కేటాయించబడుతుందని, అవి సంబంధిత సర్కిల్ కార్యాలయాల డ్యాష్‌బోర్డులో ప్రత్యక్షమవుతాయని తెలిపారు. దరఖాస్తు నమోదైన వెంటనే ఫీల్డ్ స్థాయి పరిశీలన, ఫీజిబిలిటీ పరీక్షలు, ఎస్టిమేట్‌ల తయారీ కోసం సంబంధిత అధికారులకు పంపిస్తారని తెలిపారు. 11 కేవీ దరఖాస్తులను పరిశీలించి ఫీజిబిలిటీ ఉంటే రెండు రోజుల్లో పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని, సాంకేతిక కారణాలతో సాధ్యం కాకపోతే దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందజేస్తారని పేర్కొన్నారు. 33 కేవీ మరియు అంతకంటే అధిక వోల్టేజ్ దరఖాస్తులను కూడా నిర్దేశిత సమయపాలన ప్రకారం పరిశీలించి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసి సేవలు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ సింగిల్ విండో విధానం వల్ల వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే దరఖాస్తు స్థితిని తెలుసుకునే అవకాశం ఉంటుందని సుదర్శనం వివరించారు. ఈ విధానం ద్వారా విద్యుత్ శాఖలో పారదర్శకత మరింత పెరిగి, దరఖాస్తుల తాజా సమాచారం ఎప్పటికప్పుడు వినియోగదారుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ రూపంలో అందుతుందని తెలిపారు.



## మళ్లీ కేసీఆర్ పాలన ఖాయం

**బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి.. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలని డిమాండ్**

జగిత్యాల, మే 26 (ఈవార్తలు): మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న వ్యాట్‌ను తగ్గించాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, సమన్వయకర్త, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్‌తో కలిసి పార్టీ సమన్వయకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల సమస్యలను పక్కదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. రైతుల సమస్యలపై చర్చ జరగకుండా దృష్టి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న వ్యాట్‌ను 10% తగ్గించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలతో ఆటో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచనల మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగిస్తున్నామని తెలిపారు. గత దశాబ్ద కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తెలంగాణ అభివృద్ధి, పునర్నిర్మాణం కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమైందని, రైతుబంధు, కళ్యాణలక్ష్మి, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువత, మహిళలు అసంతృప్తితో ఉన్నారని, పెట్రోల్, డీజిల్‌పై ప్రజలపై పడుతున్న భారం తగ్గించేందుకు ప్రభుత్వం వెంటనే వ్యాట్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక ప్రవీణ్, మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మున్నా, అయిల్నేని వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, సర్పంచులు, వివిధ గ్రామాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.



## తాటి చెట్టుపై పిడుగు


సారంగాపూర్, మే 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లెలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈ క్రమంలో గ్రామ శివారులోని ఓ తాటి చెట్టుపై భారీ శబ్దంతో పిడుగు పడినట్లు స్థానికులు తెలిపారు. పిడుగు ప్రభావంతో చెట్టుకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. భారీ శబ్దం వినిపించడంతో పరిసర ప్రాంత ప్రజలు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై గ్రామంలో కొంతసేపు ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.

## సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి ఆరుగురి దుర్మరణం

ఒడిశాలోని కలహండిలో ఘోర ప్రమాదం

కలహండి: ఒడిశాలో మంగళవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. కలహండి జిల్లా మదన్‌పూర్-రాంపూర్ బ్లాక్ పరిధిలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. లోపల ఉన్న విషవాయువులను పీల్చడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగా కడుతున్న సెప్టిక్ ట్యాంక్ లోపల ఉన్న సెంట్రింగ్ సామగ్రిని బయటకు తీయడానికి మొదట ఒక మేస్త్రీ లోపలికి దిగాడు. అయితే ట్యాంక్ లోపల ఆక్సిజన్ లేకపోవడం, విషవాయువులు దట్టంగా ముసురుకోవడంతో అతడు స్పృహతప్పి పడిపోయాడు. లోపల ఉన్న వ్యక్తిని కాపాడేందుకు ఒకరి వెనుక ఒకరుగా మరో ఐదుగురు ట్యాంకులోకి దిగారు. దురదృష్టవశాత్తూ ఆ విషవాయువుల ప్రభావానికి లోనై అక్కడికక్కడే కుప్పకూలారు. ట్యాంకులో నుంచి ఎలాంటి చప్పుడు రాకపోవడంతో ఆందోళన చెందిన గ్రామస్థులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.

వయ్యారి చిత్రం






## యువత మెచ్చేలా అబ్బవరం 'వదలనే'!

యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న లేటెస్ట్ మూవీ చెన్నై లవ్ స్టోరీ నుంచి విడుదలైన రెండో పాట వదలనే.. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో వైరల్ అవుతోంది. మంచి రెస్పాన్స్ కూడా తెచ్చుకుంటోంది. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మరోసారి తన మ్యూజిక్ మ్యాజిక్ చూపించారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే ఆ మెలోడీ సాంగ్ యూత్ ను బాగా అట్రాక్ట్ చేస్తోంది. ముఖ్యంగా లవ్ ఫెయిల్యూర్, ఎమోషనల్ రిలేషన్ షిప్స్ కు కనెక్ట్ అయ్యేలా పాట ఉండటంతో యువత నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఆ సాంగ్ కు ఫేమస్ లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ అందించిన లిరిక్స్ హైలైట్ గా నిలిచాయి. ప్రతి లైన్ లోనూ ప్రేమలోని ఎమోషన్ కనిపించేలా రాసిన పదాలు ఆకట్టుకుంటున్నాయి. సింగర్ జావేద్ అలీ తన గాత్రంతో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. తన వాయిస్ తో ఫిదా చేశారు. అలా మణిశర్మ కంపోజిషన్, జావేద్ అలీ వాయిస్, అనంత శ్రీరామ్ లిరిక్స్ కలిసి ఆ పాటను పక్కా సోల్ ఫుల్ మెలోడీగా మార్చేశాయని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. సినిమాలో హీరోగా కిరణ్ అబ్బవరం నటిస్తుండగా, హీరోయిన్ గా శ్రీ గౌరి ప్రియ కనిపించనున్నారు.

## హల్‌చల్ చేస్తున్న 'చున్రీ చున్రీ' రీమిక్స్ సాంగ్

బాలీవుడ్ లో 90ల కాలంలో సల్మాన్ ఖాన్, సుస్మితా సేన్ స్టెప్పులేసిన 'చున్రీ చున్రీ' సూపర్ హిట్ సాంగ్ గుర్తుందా? ఇప్పుడు అదే ఐకానిక్ పాటను సరికొత్త మోడరన్ ట్విస్ట్‌తో రీమిక్స్ చేశారు. వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్న 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' సినిమాలోని ఈ క్రేజీ సాంగ్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. కలర్‌ఫుల్ ఎనర్జీ, అదిరిపోయే డ్యాన్స్ స్టెప్పులతో ఈ పాట యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. మళ్లీ గుర్తొచ్చిన 90ల నాటి జ్ఞాపకాలు: 1999లో వచ్చిన 'బీవీ నెంబర్ 1' సినిమాలో సల్మాన్ ఖాన్, సుస్మితా సేన్ ల 'చున్రీ చున్రీ' పాట ఒక ఊపు ఊపింది. ఇన్నేళ్ల తర్వాత దర్శకుడు డేవిడ్ ధావన్ తన కొడుకు వరుణ్ ధావన్ సినిమా కోసం ఈ పాటను మళ్లీ రీక్రియేట్ చేశారు. ఇక పాత పాటలోని అదే స్పీడ్, అదే వైబ్‌ను కంటిన్యూ చేస్తూనే, ఈ తరం ఆడియన్స్‌కు నచ్చేలా పార్టీ ఎనర్జీతో ఈ కొత్త సాంగ్‌ను రెడీ చేశారు. ఈ పాటలో వరుణ్ ధావన్‌తో పాటు టాలీవుడ్ ముద్దుగుమ్మలు పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ కలిసి స్టెప్పులేశారు. ట్రైలర్‌లో ఈ పాట గ్లింప్స్ చూసినప్పటి నుంచే ఫ్యాన్స్ ఫుల్ సాంగ్ కోసం ఆత్రుతగా ఎదురుచూశారు. ఇప్పుడు సాంగ్ రావడంతో వరుణ్ ఎనర్జీ, పూజా, మృణాల్‌ల గ్లామర్ చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.



## చరణ్‌తో డ్యాన్స్ చేసి సన్నబడ్డా: జాన్వీ కపూర్



బెంగళూరులో జరిగిన 'పెద్ది' సినిమా ఈవెంట్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో పాటు హీరోయిన్ జాన్వీ కపూర్ కూడా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఈ జూన్ 4న సినిమా థియేటర్లలోకి రాబోతున్న తరుణంలో, కర్ణాటక ప్రమోషన్స్ లో జాన్వీ పంచుకున్న కొన్ని విషయాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా తన డ్యాన్స్ ఎక్స్ పీరియన్స్ బెంగళూరు ఫుడ్ గురించి ఆమె మాట్లాడిన తీరు అక్కడి ఆడియన్స్ ను బాగా ఆకట్టుకుంది. ఈవెంట్ లో యాంకర్ జాన్వీ కపూర్ ను ఆమె ఫిట్నెస్ డైట్ సీక్రెట్ గురించి ఒక ప్రశ్న అడిగింది. దానికి జాన్వీ నవ్వుతూ చాలా ఇంట్రెస్టింగ్ సమాధానం ఇచ్చింది. "నాకు తెలిసిన బెస్ట్ వెయిట్ లాస్ టిప్ ఏంటో తెలుసా.. రామ్ చరణ్ సర్ తో కలిసి ఒక్క పాటలో డ్యాన్స్ చేయండి. కేవలం నాలుగు రోజుల్లోనే మీరంతా చాలా స్లిమ్ గా మారిపోతారు" అంటూ ఒక క్రేజీ సీక్రెట్ ను బయటపెట్టింది.

## త్వరలో పెద్ది నుంచి రెండో ట్రైలర్?





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ గా చేసిన సినిమా పెద్ది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ సినిమా వస్తోంది. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్న ఈ మూవీలో రామ్ చరణ్ హీరోగా చేస్తుండగా, హీరోయిన్ గా జాన్వీ కపూర్ మెరువనున్నారు. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్.. గౌరనాయుడు అనే రోల్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీత స్వరాలు అందిస్తుండగా... వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రి మూవీ మేకర్స్ ఆధ్వర్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. అదే జూన్ 4వ తేదీన ఈ సినిమా రిలీజ్ కానుండగా ఇప్పటికే ట్రైలర్ లాంచ్ చేశారు. దీంతో సినిమాపై హైప్ అమాంతం పెరిగింది. అయితే సినిమా రిలీజ్ కు మరో వారం రోజుల సమయం ఉన్న నేపథ్యంలో.. జనాలకు మరింత దగ్గరగా పెద్ది సినిమాను తీసుకువెళ్లేందుకు చిత్ర బృందం ప్లానింగ్ చేస్తోంది. ఇందులో భాగంగానే రెండో ట్రైలర్ కూడా రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారట. దీనిపై త్వరలోనే ప్రకటన కూడా రానున్నట్లు టాక్ నడుస్తోంది.

## మరోసారి ఆనంద్-వైష్ణవి




యూత్ ఫుల్ ప్రేమకథలంటే తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడూ ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. ఇప్పుడు అదే లిస్ట్ లోకి చేరేందుకు సిద్ధమవుతోంది ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ చిత్రం. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఆ సినిమా నుంచి తాజాగా విడుదలైన రెండో సింగిల్ ప్రియసఖి సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. మెలోడీ, విజువల్స్, లిరిక్స్ కలిసి ఆ పాటను యూత్ కు దగ్గర చేస్తున్నాయి. 90స్ ఏ మిడిల్ క్లాస్ బయోపిక్ వెబ్ సిరీస్ తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ ఆ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సాంగ్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు



## ఏవీ గుడ్డిగా నమ్మొద్దు

యంగ్ బ్యూటీ రాశీ ఖన్నా సోషల్ మీడియా ద్వారా ఫిట్‌నెస్ సీక్రెట్స్ గురించి, మానసిక ప్రశాంతత గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తనకు వర్కవుట్ చేయడం అనేది ఒక థెరపీ లాంటిదని, అది తన జీవితంలో ఉన్న నెగటివిటీని దూరం చేయడానికి ఎంతగానో సహాయపడుతుందని వెల్లడించింది. సమయం గడుస్తున్న కొద్దీ ఫిట్‌నెస్ పట్ల తనకున్న ఆలోచన పూర్తిగా మారిపోయిందని రాశీ ఖన్నా అంగీకరించింది. "వర్కవుట్స్ చేయడం వల్ల నా మైండ్ చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఒకవేళ నేను వర్కవుట్ చేయకపోతే, నా జీవితంలో నెగటివిటీ మొత్తం నాలోనే పేరుకుపోతుందని నేను భావిస్తాను. ఫిట్‌నెస్ అనేది ఒక పరిపూర్ణమైన ప్రయాణం. ఇది కేవలం మీ లుక్స్‌ను మాత్రమే కాకుండా, మీ ఆలోచనా విధానాన్ని, మీరు ప్రతిరోజూ ఎలా ఫీల్ అవుతున్నారనే దాన్ని కూడా మారుస్తుంది" అని రాశీ ఖన్నా చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా రాశీ ఖన్నా ముఖ్యంగా అమ్మాయిలకు ఒక మంచి సలహా ఇచ్చింది. వేరొకరితో మిమ్మల్ని మీరు పోల్చుకోవడం ఆపేయాలని కోరింది. "ప్రతి ఒక్కరి శరీరం చాలా ప్రత్యేకం. నా ఫిట్‌నెస్ ప్రయాణం మొదట్లో నేను కూడా కేవలం సన్నగా అవ్వాలనే అనుకున్నాను. అది నేను చేసిన ఒక పెద్ద తప్పు. దయచేసి సోషల్ మీడియాలో వచ్చే ట్రెండ్స్‌ను గుడ్డిగా ఫాలో అవ్వకండి. సన్నగా మారడం కంటే మీ శరీరాన్ని బలంగా మార్చుకోవడానికి ప్రయత్నించండి. రోజుకో చిన్న అడుగు వేస్తూ ఏదో ఒక శారీరక శ్రమను అలవాటు చేసుకోండి" అని రాశీ సూచించింది.

## భరతనాట్యంపై విమర్శలు



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్యా పాండే నటించిన 'చాంద్ మేరా దిల్' సినిమాలోని ఒక చిన్న డాన్స్ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెపై విపరీతమైన ట్రోలింగ్ మొదలైంది. ఆ సీన్‌లో ఆమె చేసిన ఫ్యూజన్ భరతనాట్యం డ్యాన్స్ పై నెటిజన్లు, క్లాసికల్ డాన్సర్లు, కొందరు రాజకీయ నాయకులు కూడా తీవ్రంగా మండిపడ్డారు. అనన్యా పాండే సాంప్రదాయ భరతనాట్య కళను అవమానించిందంటూ నెట్టింట పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. తాజాగా, ఈ వివాదంపై అనన్య తండ్రి, సీనియర్ నటుడు చుంకీ పాండే స్పందిస్తూ.. "జనాలు ఆ డ్యాన్స్ వీడియోను పూర్తిగా తప్పుగా అర్థం చేసుకున్నారని నేను అనుకుంటున్నాను. ఆ సీన్‌లో చేసింది అసలు ప్యూర్ భరతనాట్యం కాదు, అలా చేయాలని కూడా మేకర్స్ అనుకోలేదు. అది కేవలం ఒక ఫ్యూజన్ పర్ఫార్మెన్స్ మాత్రమే. కాలేజీ స్టూడెంట్స్ తమ కల్చరల్ ఫెస్టివల్స్ లేదా కాలేజీ ఈవెంట్స్‌లో కొత్తగా ట్రై చేసే ఒక రకమైన ఎక్స్‌పెరిమెంటల్ డ్యాన్స్ అది. తొందరపడి విమర్శలు చేయొద్దు" అని చుంకీ పాండే పేర్కొన్నారు.



# కార్ల్‌సన్‌కు షాక్

**తొలి రౌండ్‌లోనే ఓటమి.. గుకేశ్, ప్రజ్ఞానంద శుభారంభం**

నార్వే చెస్ టోర్నీలో తొలిరోజే సంచలనం నమోదైంది. ఫేవరెట్ ఆటగాడైన వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌కు ఊహించని ఓటమి ఎదురైంది. తొలి రౌండ్‌లోనే అలిరెజా ఫిరౌజా చేతిలో కార్ల్‌సన్ పరాజయం పాలయ్యాడు. ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్ మారథాన్ పోరులో డ్రాతో గట్టెక్కగా, భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అద్భుత పోరాట పటిమతో శుభారంభం చేశాడు. మహిళల విభాగంలో దివ్య దేశ్‌ముఖ్ ధాటికి ఛాంపియన్ జు వెంజున్ చేతులెత్తేసింది. నార్వే చెస్ తొలి రౌండ్‌లో భారత కుర్రాడు గుకేశ్‌కు విన్సెంట్ కెయ్‌మెర్(జర్మనీ) నుంచి గట్టిపోటీ ఎదురైంది. దాదాపు ఐదు గంటల పాటు సాగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి 144 ఎత్తులు వేయడంతో గుకేశ్ చెమటోడ్చక తప్పలేదు. టై బ్రేకర్‌లో పుంజుకున్న భారత స్టార్ 1.5 పాయింట్లు సాధించాడు. పొరపాటుకు భారీ మూల్యం చెల్లించుకున్నాడు. ప్రజ్ఞానంద సైతం టై బ్రేకర్‌లోనే వెస్లేను చిత్తు చేశాడు. ఎదురుదాడి వ్యూహంతో ఆడిన భారత గ్రాండ్‌మాస్టర్ 1.5 పాయింట్లతో గుకేశ్‌తో సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ సంచలన ఆటతో ఛాంపియన్ జు వెంజున్‌కు చెక్ పెట్టింది. టై బ్రేకర్‌లో జోరు చూపించి విజేతగా నిలిచింది.


# మెస్సీకి గాయం

**వరల్డ్ కప్‌కు ముందు ఆందోళన**

ఫిఫా ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ అర్జెంటీనాకు బిగ్ షాక్. గత సీజన్‌లో సంచలన ఆటతో జట్టును విజేతగా నిలిపిన లియోనల్ మెస్సీ అనూహ్యంగా గాయపడ్డాడు. మెగా టోర్నీకి సన్నద్ధత శిబిరానికి ముందే తొడ కండరాల గాయంతో బాధ పడుతున్న మెస్సీ.. సాకర్ వరల్డ్‌కప్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. దాంతో, దిగ్గజ ఆటగాడి సేవల్ని కోల్పోతామా? అని అర్జెంటీనా టీమ్, అభిమానులు పరేషాన్ అవుతున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా సాకర్ ప్రపంచకప్‌ను నిలబెట్టుకోవాలనుకుంటున్న అర్జెంటీనా బిగ్ షాక్ తప్పేలా లేదు. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో ఫ్రాన్స్‌పై మెరుపు గోల్స్‌తో ట్రోఫీ అందించిన కెప్టెన్ లియోనల్ మెస్సీ ఈసారి టోర్నీకి దూరమయ్యేలా ఉన్నాడు. బ్రిటన్‌కు చెందిన ఇంటర్ మియామి క్లబ్‌కు ఆడుతున్న లియోన్ మెస్సీ ఆదివారం మ్యాచ్ ఆడుతూ మైదానంలో గాయపడ్డాడు. ఎడమ కాలి నొప్పి కారణంగా అతడు ఇలా వచ్చి అలా బయటకు వెళ్లాడు. 'మేజర్ లీగ్ సాకర్‌లో ఫిలడెల్ఫియా యూనియన్‌తో మ్యాచ్‌లో మెస్సీ గాయపడ్డాడు. ఎడమ తొడ కండరాల నొప్పితో విలవిలలాడుతూ అతడు మైదానంలో కూలబడ్డాడు. వైద్య పరీక్షల అనంతరం అతడు కండరాల అలసటతో బాధ పడుతున్నాడని తెలిసింది. తొడ కండరాల గాయం నుంచి కోలుకోవడం అనేది వైద్యపరమైన అంశాలు, శారీరక స్పందనపై ఆధారపడి ఉంది. ఈ గాయం నుంచి కోలుకునేందుకు ఒక్కోసారి కొన్ని రోజుల్లోనే కొన్నిసార్లు.. వారాలు పడుతుంది' అని ఇంటర్ మియామి క్లబ్ ఓ ప్రకటనలో తెలిపింది. జూన్ 11 నుంచి ఫిఫా ప్రపంచకప్ మొదలవ్వనుంది. జూన్ 16న అల్జీరియాతో అర్జెంటీనా తలపడనుంది.







# ఫైనల్లో బెంగళూరు

**కెప్టెన్ పాటీదార్ ఊచకోత.. పలు రికార్డులు బద్ధలు.. ఛేదనలో తేలిపోయిన గుజరాత్**

రెండో టైటిల్‌పై కన్నేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫయర్ 1లో గర్జించింది. ధర్మశాలలో ఏకపక్ష పోరులో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. రజత్ పటిదార్(93) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రికార్డు స్కోర్ కొట్టిన ఆర్సీబీ.. జాకబ్ డఫ్ఫీ(39-3), రసిక్ దార్ సలాం(24-2), భువనేశ్వర్(28-4) విజృంభణతో గుజరాత్‌ను చిత్తు చేసి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఘోర ఓటమి చవిచూసిన శుభ్‌మన్ గిల్ సేన ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది.

19వ సీజన్ క్వాలిఫయర్ 1లో 254 పరుగులతో అత్యధిక స్కోర్ రికార్డు బద్ధలు కొట్టిన ఆర్సీబీ.. గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కనీసం పోరాడకుండానే మ్యాచ్‌ను బెంగళూరుకు అప్పగించేసింది. పేసర్లు జాకబ్ డఫ్ఫీ (39-3) రసిక్ దార్(24-2), హేజిల్‌వుడ్(39-1)లు వికెట్ల వేటతో చెలరేగగా ప్రత్యర్థిని 162 కే కట్టడి చేసిన రజత్ పటిదార్ బృందం 92 పరుగుల భారీ విజయంతో ఫైనల్లో అడుగుపెట్టింది. ఆర్సీబీ నిలిపిన 255 పరుగుల లక్ష్యాన్ని చూసి నీరుగారిపోయిన గుజరాత్ ఛేదనలో ఆది నుంచి తడబడింది. ఓపెనర్ సుదర్శన్(14) బ్యాట్‌ను వికెట్లపై పడేసుకొని హిట్‌వికెట్‌గా వెనుదిరగగా.. భువనేశ్వర్ ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(2)ను బౌల్డ్ చేసి గుజరాత్‌కు షాకిచ్చాడు. అనంతరం హేజిల్‌వుడ్ ఓవర్లో 4, 6, 4 బాదిన బట్లర్(29) బౌల్డయ్యాడు. రసిక్ దార్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిషాంత్ సింధు(5).. తర్వాతి బంతికేహేజిల్‌వుడ్ చేతికి చిక్కి హోల్డర్(0) చిక్కగా 51కే సగం వికెట్లు కోల్పోయింది గుజరాత్. అప్పటికే ఓటమి ఖరారవ్వగా సుందర్ తేలిపోయాడు. సహకరించేవాళ్లు లేక ఒంటరైన ఇంప్యాక్ట్ సబ్ తెవాటియా(68) పరుగుల అంతరం తగ్గించే ప్రయత్నం చేశాడు. అర్ధ శతకంతో విసిగించిన తెవాటియా 19వ ఓవర్లో పటిదార్ క్యాచ్‌తో డగౌట్ చేరాడు. సిరాజ్ చివరి వికెట్‌గా ఔటవ్వగా ఆర్సీబీ 92 పరుగులతో విజయం సాధించింది. క్వాలిఫయర్ 1లో కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రికార్డు స్కోర్ కొట్టింది. విరాట్ కోహ్లీ(43), పడిక్కల్(30)లు అదిరే ఆరంభమివ్వగా.. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆర్సీబీ 76 పరుగులు చేసింది. అనంతరం కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) మెరుపుఇన్నింగ్స్‌తో గుజరాత్ బౌలర్లను భయపెట్టాడు. ఖేజ్రోలియా వేసిన 15వ ఓవర్లో రెండు నో బాల్స్, వైడ్, నాలుగు ఫోర్లు, సిక్సర్ కలిపి 28 రన్స్ వచ్చాయి. డో వికెట్‌కు 95 రన్స్ జోడించిన కృనాల్(43)ను రబడ ఔట్ చేయగా గుజరాత్ ఊపిరిపీల్చుకుంది. కానీ, పటిదార్ రెండు సిక్సర్లతో స్కోర్ రెండొందలు దాటించాడు. అంతేనా.. ప్రసిధ్ వేసిన చివరి ఓవర్లో రెండు సిక్సర్లు బాదేశాడు. గుజరాత్ చెత్త ఫీల్డింగ్ కూడా కలిసి రావడంతో ఆర్సీబీ నాకౌట్‌లో అత్యధిక స్కోర్‌తో చరిత్ర సృష్టించింది. 2023లో ముంబై ఇండియన్స్‌పై 233/3తో గుజరాత్ సాధించిన రికార్డును బెంగళూరు బద్ధలు కొట్టింది.

# బెంగళూరుదే ట్రోఫీ?

**క్వాలిఫైయర్ 1 గెలిస్తే ట్రోఫీ ఖాయం!**

**ఐపీఎల్‌లో కొనసాగుతున్న సెంటిమెంట్**

**గత 15 సీజన్లలో 12 సార్లు పునరావృతం**

**గత ఎనిమిదేళ్లుగా ఇదే ఆనవాయతీ**

గత కొన్నేళ్లుగా ఐపీఎల్‌లో ఓ ఆసక్తికరమైన సెంటిమెంట్ బలంగా కొనసాగుతోంది. అదేంటంటే.. క్వాలిఫైయర్ 1లో గెలిచిన జట్టే దాదాపుగా టైటిల్ విజేతగా నిలవడం. 2008లో ప్రారంభమైన ఐపీఎల్ చరిత్రలో ఈ సెంటిమెంట్‌కు బలమైన ఆధారం ఉంది. ముఖ్యంగా 2011 నుంచి ప్లేఆఫ్స్ విధానం అమల్లోకి వచ్చాక, ఇప్పటివరకు జరిగిన 15 సీజన్లలో ఏకంగా 12 సార్లు క్వాలిఫైయర్ 1లో విజయం సాధించిన జట్లే ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడాయి. అంటే.. దాదాపు 80శాతం సందర్భాల్లో ఇదే ఫలితం పునరావృతమైంది. ఇది ఈ మ్యాచ్ ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేస్తోంది. ఇక ఇటీవలి చరిత్రను చూస్తే, ఈ నమ్మకం మరింత బలపడుతోంది. 2018 నుంచి 2025 వరకు గత ఎనిమిది సీజన్లలోనూ క్వాలిఫైయర్ 1లో గెలిచిన జట్టే ఛాంపియన్‌గా నిలవడం ఒక ఆనవాయితీగా మారింది. 2018లో చెన్నై సూపర్ కింగ్స్ మొదలుకొని, 2019, 2020లో ముంబై ఇండియన్స్, 2021లో సీఎస్కే, 2022లో గుజరాత్ టైటాన్స్, 2023లో మళ్లీ సీఎస్కే, 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్, గత ఏడాది (2025) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు... ఇలా ప్రతీసారి క్వాలిఫైయర్ 1 విజేతలే టైటిల్ గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది క్వాలిఫైయర్1లో బెంగళూరు గెలిచింది. ఆ సెంటిమెంట్ ప్రకారం బెంగళూరు జట్టుకే టైటిల్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మరోవైపు ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ పోటీ పడుతున్నాయి. మరి గత ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆనవాయతీ ఈసారి రిపీట్ అవుతుందా? లేక ఎలిమినేటర్ నుంచి వచ్చే జట్టు ఏదైనా అద్భుతం చేసి చరిత్రను తిరగరాస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.



# భారత్‌తో పోరుకు ఆఫ్ఘన్ జట్టు ప్రకటన

**టెస్టు, వన్డే సిరీస్‌లకు వేర్వేరు జట్లు**



భారత్ పర్యటన కోసం ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) సోమవారం జట్లను ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా ఒక టెస్టు మ్యాచ్, మూడు వన్డేల సిరీస్ జరగనుండగా, ఈ రెండు ఫార్మాట్లకు ఆల్‌రౌండర్ హష్మతుల్లా షాహిదినే కెప్టెన్‌గా కొనసాగిస్తున్నట్లు ఏసీబీ స్పష్టం చేసింది. ఇందుకోసం 15 మంది సభ్యులతో కూడిన వేర్వేరు జట్లను ఎంపిక చేసింది. స్టార్ ఆటగాళ్లు రషీద్ ఖాన్, రహ్మానుల్లా గుర్బాజ్, మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ వంటి కీలక ఆటగాళ్లకు ఈ జట్లలో చోటు కల్పించారు. వన్డే జట్టును పరిశీలిస్తే, అనుభవజ్ఞులైన ఆటగాళ్లకే ఏసీబీ పెద్దపీట వేసింది. రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ ఓపెనర్లుగా బరిలోకి దిగే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ షాహిది, రహ్మత్ షా, దర్విష్ రసూలి జట్టుకు స్థిరత్వం చేకూర్చనున్నారు. ఆల్‌రౌండర్లు మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ జట్టుకు సమతూకం అందించనున్నారు. ఇక బౌలింగ్ విభాగానికి స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నాయకత్వం వహించనుండగా, యువ స్పిన్నర్ ఏఎం గజన్ఫర్‌తో పాటు పేసర్లు బిలాల్ సమీ, ఫరీద్ మాలిక్, జియా-ఉర్-రెహ్మాన్ షరీఫీలకు స్థానం కల్పించారు. అయితే, ఏకైక టెస్టు మ్యాచ్ కోసం ప్రకటించిన జట్టులో ఏసీబీ కొన్ని ఆసక్తికర మార్పులు చేసింది. ముఖ్యంగా, స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌కు ఈ టెస్టు నుంచి విశ్రాంతినిచ్చింది. అతని స్థానంలో స్పిన్నర్లుగా ఖైస్ అహ్మద్, నంగ్యాల్ ఖరోటై, షరాఫుద్దీన్ అష్రఫ్‌లపై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. టెస్టు జట్టులోకి అబ్దుల్ మాలిక్, రహ్మానుల్లా జద్రాన్, షరాఫుద్దీన్ అష్రఫ్ కొత్తగా రాగా, రహ్మత్ షా, గుర్బాజ్ వంటి సీనియర్లు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. వికెట్ కీపర్లుగా ఇక్రమ్ అలీఖిల్, అఫ్సర్ జజాయ్‌లను ఎంపిక చేశారు. భారత్ లో ఆఫ్ఘనిస్థాన్ పర్యటన ఏకైక టెస్టు మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్ జూన్ 6 నుంచి 10 వరకు న్యూ చండీగఢ్‌లో జరుగుతుంది. అనంతరం మూడు వన్డేల సిరీస్ ప్రారంభమవుతుంది. తొలి వన్డే జూన్ 13న ధర్మశాలలో, రెండో వన్డే జూన్ 17న లక్నోలో, చివరిదైన మూడో వన్డే జూన్ 20న చెన్నైలో జరగనున్నాయి.

**ఆఫ్ఘనిస్థాన్ వన్డే జట్టు:** హష్మతుల్లా షాహిది (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, సెదికుల్లా అటల్, దర్విష్ రసూలి, రహ్మత్ షా, ఇక్రమ్ అలీఖిల్ (వికెట్ కీపర్), మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, రషీద్ ఖాన్, నంగ్యాల్ ఖరోటై, ఏఎం గజన్ఫర్, జియా-ఉర్-రెహ్మాన్ షరీఫీ, ఫరీద్ మాలిక్, బిలాల్ సమీ.

**రిజర్వ్ ఆటగాళ్లు:** ఖైస్ అహ్మద్, సలీమ్ సఫీ, బషీర్ అహ్మద్.

**ఆఫ్ఘనిస్థాన్ టెస్ట్ జట్టు:** హష్మతుల్లా షాహిది (కెప్టెన్), అబ్దుల్ మాలిక్, సెదికుల్లా అటల్, రహ్మత్ షా, రహ్మానుల్లా గుర్బాజ్, రహ్మానుల్లా జద్రాన్, అఫ్సర్ జజాయ్ (వికెట్ కీపర్), ఇక్రమ్ అలీఖిల్ (వికెట్ కీపర్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్, షరాఫుద్దీన్ అష్రఫ్, నంగ్యాల్ ఖరోటై, ఖైస్ అహ్మద్, బిలాల్ సమీ, జియా షరీఫీ, సలీమ్ సఫీ.

**రిజర్వ్ ఆటగాళ్లు:** బషీర్ అహ్మద్, బహిర్ షా, ఇస్మత్ ఆలం.

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# కాంగ్రెస్‌ను వీడని సంక్షోభం

భారతదేశంలో దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంగా పాలించిన కాంగ్రెస్ పార్టీ, మునుపెన్నడూ లేని విధంగా తీవ్రమైన నాయకత్వ లేమితో, రాజకీయ అస్థిరతతో కొట్టుమిట్టాడుతోంది. కేంద్రంలో అధికారం కోల్పోయి ఏళ్లు గడుస్తున్నా, పార్టీని గాడిన పెట్టే బలమైన వ్యూహం కానీ, ప్రజలను ఆకర్షించే గట్టి నాయకత్వం కానీ కనిపించకపోవడం ఆ పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. కొన్ని రాష్ట్రాలకే పరిమితమైన అధికారం కూడా ఇప్పుడు అంతర్గత కలహాలు, రాజకీయ అనిశ్చితి వల్ల మునిగిపోయే నావలా తయారైంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేతిలో మిగిలిన కొన్ని రాష్ట్రాల్లోనూ ప్రశాంతమైన పాలన సాగడం లేదు. ప్రాంతీయ నేతల మధ్య ఆధిపత్య పోరు, వర్గ రాజకీయాలు పార్టీని బలహీనపరుస్తున్నాయి. ఒకవైపు ప్రతిపక్షాల వ్యూహాలను తట్టుకుంటూ, మరోవైపు సొంత పార్టీలోనే ఎప్పుడు ఎవరు తిరుగుబాటు చేస్తారో తెలియని ఉత్కంఠభరిత వాతావరణంలో ముఖ్యమంత్రులు కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఈ రాజకీయ అనిశ్చితి వల్ల ప్రజాపాలన కుంటుపడుతోంది. ఇది ప్రజల్లో పార్టీ పట్ల ఉన్న నమ్మకాన్ని మరింతగా సడలిస్తోంది. కాంగ్రెస్ పార్టీని పీడిస్తున్న ప్రధాన సమస్య 'నాయకత్వ లోపం'. జాతీయ స్థాయిలో పార్టీని నడిపించే విషయంలో స్పష్టత కరువైంది. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే బలమైన ముఖచిత్రం లేకపోవడం పెద్ద మైనస్. నిర్ణయాలు తీసుకోవడంలో జరుగుతున్న ఆలస్యం, హైకమాండ్ బలహీనత స్థానిక నాయకులకు చులకనగా మారుతోంది. సంక్షోభ సమయాల్లో త్వరితగతిన స్పందించి, దిశానిర్దేశం చేసే సమర్థవంతమైన వ్యూహకర్తలు లేకపోవడం వల్లనే కాంగ్రెస్ క్రమంగా తన పట్టును కోల్పోతోంది. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్ఠానం వాస్తవాలను గ్రహించాలి. అంతర్గత కలహాలకు ఫుల్‌స్టాప్ పెట్టి, గ్రూపు రాజకీయాలను కఠినంగా అణచివేయాలి. వారసత్వ రాజకీయాలపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయి నుండి ప్రజల్లో పట్టున్న సమర్థులైన ప్రాంతీయ నాయకులను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైంది. లేదంటే, అధికారంలో లేని కేంద్రంలోనే కాదు, ప్రస్తుతం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

**గిరిజన అభివృద్ధిలో సాంకేతికత ఎందుకు అత్యవసరమైందో అర్థం చేసుకోవాలంటే ముందుగా సవాళ్ల పరిమాణాన్ని అర్థం చేసుకోవాలి. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్, జాతీయ సికిల్ సెల్ అనీమియా నిర్మూలన మిషన్ వంటి కార్యక్రమాలు దేశంలోని 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 549 జిల్లాలు, 2,911 బ్లాకుల పరిధిలో ఉన్న 63వేలకు పైగా గ్రామాలను కవర్ చేస్తున్నాయి. వీటి ద్వారా 5.5 కోట్లకు పైగా గిరిజన పౌరులు లబ్ధి పొందుతున్నారు. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, గృహాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, కనెక్టివిటీ, జీవనోపాధి వంటి ప్రాథమిక సేవలను సంపూర్ణంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.**

**ఇంత విస్తృతమైన భౌగోళిక పరిధిలో ప్రతి కుటుంబాన్ని చేరుకోవాలంటే డేటా ఆధారిత, పరస్పర అనుసంధానిత, స్పందనాత్మక వ్యవస్థలు అవసరం. ప్రస్తుతం మనం నిర్మిస్తున్న వ్యవస్థల మూల స్ఫూర్తి ఇదే. ఈ ఏడాది "జనజాతీయ గరిమా ఉత్సవ్" నాలుగు ప్రధాన అంశాల చుట్టూ నిర్వహిస్తున్నారు. ఇవి గిరిజన అభివృద్ధిని సంపూర్ణంగా ప్రతిబింబిస్తాయి. "అభివృద్ధికి దారితీసే శక్తిగా సాంకేతికత" అనే భావన తొలి అంశం. డిజిటల్ వ్యవస్థలు, విజ్ఞానం, ఆవిష్కరణలు ఎలా దేశంలోని అత్యంత దూర ప్రాంతాల గిరిజన సమాజాలకు పరిపాలన, అవకాశాలను చేరవేస్తున్నాయో ఇది చూపిస్తుంది. ఈ దృష్టికోణం వెనుక ఒక సరళమైన, బలమైన సూత్రం ఉంది - అభివృద్ధి చివరి మైలు వరకు చేరుకోవాలి; అదే సమయంలో గిరిజన భాషలు, సంస్కృతి, వారసత్వం, సంప్రదాయ జ్ఞాన వ్యవస్థలకు గౌరవం కూడా కలిగి ఉండాలి.**




# గిరిజన భాషకు ఏఐ నీరాజనం

> దేశవ్యాప్తంగా అరణ్యాలు, కొండ ప్రాంతాలు, దూర ప్రాంత గిరిజన వాసాలలో నిశ్శబ్దంగా అత్యంత ప్రభావవంతంగా ఒక మార్పు జరుగుతోంది. భారత అభివృద్ధి కథనంలో తమకు తగిన స్థానం కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న గిరిజన సమాజాలు, ఇప్పుడు దేశ పురోగతికి క్రియాశీల శిల్పులుగా ఎదుగుతున్నాయి. ఇదే భావజాలాన్ని "జనజాతీయ గరిమా ఉత్సవ్" ప్రతిబింబిస్తోంది. ఇది వికసిత్ భారత్ వైపు సాగుతున్న ఒక జాతీయ ప్రయాణానికి ప్రతీక. ఇక్కడ అభివృద్ధి అనేది భౌగోళిక పరిస్థితుల ఆధారంగా కొందరికి మాత్రమే లభించే ప్రత్యేక హక్కు కాదు; ప్రతి పౌరుడికి సమానంగా చెందే హక్కు

## గిరిజన గౌరవానికి సేవలో సాంకేతికత

సాంకేతికతను సార్థక దిశలో వినియోగిస్తే అది ఎంతటి మార్పు తీసుకురాగలదో చూపించే అత్యంత ప్రభావవంతమైన ఉదాహరణ "బిర్సా 101". ఇది సికిల్ సెల్ వ్యాధికి భారతదేశం అభివృద్ధి చేసిన తొలి స్వదేశీ క్రిస్పర్ ఆధారిత జీన్‌థెరపీ. సికిల్ సెల్ వ్యాధి గిరిజన సమాజాలకు ఎన్నో సంవత్సరాలుగా తీవ్రమైన ఆరోగ్య సమస్యగా ఉంది. ఇప్పుడు భారత్ 'సమానత్వం, అందరికీ అందుబాటులో' అనే విలువల ఆధారంగా ఆధునిక విజ్ఞానంతో ఈ సవాల్‌కు సమాధానం ఇస్తోంది. ఈ పరిశోధన, క్లినికల్ ట్రయల్ మౌలిక వసతులు, సాంకేతిక బదిలీ కోసం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. సీఎస్ఐఆర్, సీఎస్ఐఆర్–ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జీనోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ, సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లతో కలిసి ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఇటీవల సీఎస్ఐఆర్–ఐజీఐబీలో నిర్వహించిన సదస్సులో శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, సికిల్ సెల్ యోధులు పాల్గొని ఈ కార్యక్రమం వెనుక ఉన్న శాస్త్రీయ పురోగతిని, మానవీయ ఆవశ్యకతను పునరుద్ఘాటించారు.

అవసరమైన ప్రతి గిరిజన కుటుంబానికి అందుబాటులో ఉండే, ఒకేసారి చికిత్సతో నయం చేసే సౌకర్యాన్ని అభివృద్ధి చేయడం ద్వారా "బిర్సా 101" కేవలం వైద్య రంగంలో ఒక మైలురాయి మాత్రమే కాదు.. భారతదేశంలోని అత్యాధునిక విజ్ఞానం అత్యంత అర్హులైన వారికి అందుబాటులో ఉంటుందనే లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాయి. ఈ ఆలోచన ఒక్క కార్యక్రమంతో మాత్రమే పరిమితం కాలేదు. ట్రెడిషనల్ నాలెడ్జ్ డిజిటల్ లైబ్రరీ, ఆయుర్జెనోమిక్స్ వంటి ప్రయత్నాలు గిరిజన సమాజాలు తరతరాలుగా సంరక్షిస్తున్న ఔషధ, పర్యావరణ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికత ద్వారా నమోదు చేయడం, ధృవీకరించడం, పరిరక్షించడం ఎలా సాధ్యమవుతోందో చూపిస్తున్నాయి. కృత్రిమ మేధస్సును గిరిజన అభివృద్ధిలో సమగ్రతతో వినియోగించేందుకు కూడా ఇదే భావజాలం మార్గనిర్దేశం చేస్తోంది. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో మంత్రిత్వ శాఖ పలు ఏఐ ఆధారిత వేదికలను ప్రదర్శించింది. వాటి వెనుక ఉన్న ప్రాథమిక నమ్మకం స్పష్టమైనది - భాష అనేది అధిగమించాల్సిన అడ్డంకి కాదు; గర్వంగా భావించాల్సిన గుర్తింపు. "ఆది వాణి" అనే ఏఐ ఆధారిత గిరిజన భాషల అనువాద వేదిక టెక్స్ట్–టు–టెక్స్ట్, టెక్స్ట్–టు–స్పీచ్ అనువాదం, ఓసీఆర్ సేవలు, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని గిరిజన భాషల్లో అందిస్తోంది. దీని ద్వారా ప్రజలు తమ ఇళ్లలో మాట్లాడే భాషలోనే ప్రభుత్వ సేవలతో అనుసంధానమవుతున్నారు. "ట్రైబోట్" అనే బహుభాషా సంభాషణాత్మక ఏఐ అసిస్టెంట్ దూర ప్రాంత ప్రజలకు



రచయిత్రి: రంజనా చోప్రా
భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి

తక్షణ మార్గదర్శకత్వం, ఫిర్యాదు పరిష్కార సేవలను అందిస్తూ ఈ ప్రయత్నాన్ని మరింత బలోపేతం చేస్తుంది. భగవాన్ బిర్సా ముండా సెల్, ఐఐటీ ఢిల్లీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సదస్సులో కూడా ఏఐ వినియోగంలో సాంస్కృతిక సున్నితత్వం, సమాజ కేంద్రిత దృక్పథం, గిరిజన భాషల దీర్ఘకాల పరిరక్షణ వంటి అంశాలు చర్చించారు.

## సాంస్కృతిక గౌరవం - ఆర్థిక సాధికారత

సాంకేతికత ఇప్పుడు సాంస్కృతిక గౌరవాన్ని, ఆర్థిక సాధికారతను పెంపొందించే శక్తివంతమైన సాధనంగా మారుతోంది. త్వరలో ప్రారంభంకానున్న "ట్రైబ్‌ఎక్స్" వేదిక గిరిజన కళలు, భాషలు, సంప్రదాయ జ్ఞానం, సంగీతం, హస్తకళలు, సాంస్కృతిక అనుభవాలను ప్రోత్సహించే డిజిటల్ వ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి తోడుగా ప్రతిపాదిత "జీఐ పొటెన్షియల్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ అట్లాస్ ఆఫ్ ట్రైబల్ ఇండియా" ద్వారా గిరిజన హస్తకళలు, అటవీ ఉత్పత్తులు, సంప్రదాయ కళారూపాలను డిజిటల్ రూపంలో మ్యాపింగ్ చేయనున్నారు. దీని ద్వారా బ్రాండింగ్, మార్కెట్ అవకాశాలు, గిరిజన మేధో వారసత్వానికి గుర్తింపు మరింత బలపడుతుంది.

అదేవిధంగా ఐదు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయనున్న "ఇన్నోవేషన్ హబ్‌లు" డిజైన్, ఉత్పత్తి అభివృద్ధి, జీఐఎస్ ఆధారిత ప్రణాళికా డ్యాష్‌బోర్డులు, స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ మౌలిక వసతులు వంటి సేవలను అందిస్తూ గిరిజన యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించనున్నాయి.

## పరిపాలనలో సాంకేతిక విప్లవం

గిరిజన సమాజాలకు పరిపాలన చేరుకునే విధానాన్ని కూడా సాంకేతికత పూర్తిగా మార్చుతోంది. పీఎం–జన్‌మన్ కింద అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాల సర్వేల కోసం అమలు చేస్తున్న "సర్వే సేతు" వేదిక ద్వారా సంక్షేమ కార్యక్రమాల అమలును రియల్ టైమ్‌లో, జియో–ట్యాగ్ ఆధారంగా పర్యవేక్షిస్తున్నారు. 18 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అమలవుతున్న ఈ వేదికలో ఇప్పటివరకు 8,552 మంది సర్వేయర్ల సహకారంతో 3.43 లక్షల కుటుంబాల వివరాలు నమోదయ్యాయి. ఇలాంటి డేటా ఆధారిత వ్యవస్థలు అర్హ త కలిగిన ప్రతీ కుటుంబాన్ని గుర్తించి వారికి అవసరమైన సేవలు అందేలా చూస్తున్నాయి. ఇదే సమయంలో అటవీ హక్కుల చట్టం అమలును సులభతరం చేయడానికి ఏఐ ఆధారిత పరిపాలనా వేదికను కూడా మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేస్తోంది. దీనివల్ల క్లెయిమ్ దరఖాస్తులు, జీఐఎస్ మ్యాపింగ్, పనుల పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం మరింత సమర్థవంతంగా సాగుతాయి. ఈ కార్యక్రమాలు గిరిజన పౌరులకు పరిపాలనను మరింత పారదర్శకంగా, స్పందనాత్మకంగా, అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. మన ప్రయాణ సారమంతా ఒక మాటలో చెప్పవచ్చు. అది ఏ విధాన పత్రంలోనూ, మంత్రిత్వ సమీక్షలోనూ కనిపించదు. దూర ప్రాంత గిరిజన గ్రామంలో నివసించే ఒక మహిళ, సాంకేతికత ద్వారా, తన భాషలో, ప్రభుత్వం తన మాట వింటుందనే నమ్మకంతో ప్రభుత్వ సేవలను స్వయంగా వినియోగించి, గౌరవంతో సమాధానం పొందినప్పుడు ఆ క్షణం సాకారమవుతుంది. అది ఒక ప్రయాణానికి ముగింపు కాదు; భారత జాతీయ కథనంలో ఒక కొత్త అధ్యాయం ఆరంభం.

"జనజాతీయ గరిమా ఉత్సవ్" ఇదే సందేశాన్ని గర్వంగా మోస్తోంది. గిరిజన సమాజాలు వికసిత్ భారత్ కోసం ఎదురుచూస్తున్నవారు కాదు... పర్యావరణ పట్ల జ్ఞానం, కళా సంప్రదాయాలు, నేలతో ఉన్న గాఢమైన అనుబంధంతో ఆ భారత నిర్మాణానికి అత్యంత శక్తివంతమైన, ప్రేరణాత్మక దారిదీపాలు. గిరిజనులకు సాంకేతికత చేరువైనప్పుడు, విజ్ఞానాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తున్నప్పుడు, కృత్రిమ మేధస్సు వారి భాషలోనే మాట్లాడుతున్నప్పుడు, పరిపాలన సుదూర ప్రాంతాల్లోని చివరి కుటుంబానికి చేరుతున్నప్పుడు, అభివృద్ధి అంకెల్లోనే కాక మానవీయతలోనూ కనిపించినప్పుడే సంపూర్ణమైన భారతదేశానికి మనం ప్రతి రోజు మరింత చేరువయినట్లు. గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతోమనమందరం కలిసి నిర్మిస్తున్న వికసిత్ భారత్‌ఇదే.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.